రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరి
	బుధవారం	గురువారం
కర్నూలు	6:32	5:06
నంద్యాల	6:29	5:05



ప్రమాదంలో నుజ్జయిన ద్విచక్ర వాహనం, కారణమైన కర్ణాటక బస్సు





చిన్నారి సుస్మితను పట్టుకొని విలపిస్తున్న పెద్దమ్మ



ఈరన్న, ఆదిలక్ష్మి (ఫైల్)



హేమాద్రి, నాగరత్న దంపతులు (ఫైల్)



దేవరాజు (ఫైల్)

రుధిర ధారలు

- ఆదోని మండలం పాండవగల్లులో ఘోర రోడ్డు ప్రమాదం
- రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొన్న కర్ణాటక బస్సు
- ఐదుగురు దుర్మరణం
- కుప్పగల్లుకు చెందిన దంపతులు మృతి
- మరో దంపతులు, కుమారుడు మృత్యువాత
- అతివేగమే ప్రమాదానికి కారణం
- విచారం వ్యక్తం చేసిన మంత్రి నారా లోకేశ్



ప్రమాదంలో ధ్వంసమైన ద్విచక్ర వాహనం

పుట్టబోయే బిడ్డ కోసం ఆసుపత్రికి బయల్దేరిన దంపతులు.. అనారోగ్యం బారిన పడి నాటు వైద్యుడిని సంప్రదించేందుకు భార్య, కుమారుడితో బయల్దేరిన హోంగార్డు. ఉదయం సంతోషంగా బయల్దేరిన ఆ ఐదుగురిని కాలం బలితీసుకుంది. రోడ్డు ప్రమాదానికి గురై మృత్యుఒడికి చేరారు. అతివేగంతో ఐదు నిండు ప్రాణాలను బలితీసుకున్న కర్ణాటక బస్సు రెండు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. వీరిలో ఓ మహిళ గర్భిణి కావడం మరింత విషాదకరం. 'అయ్యో.. దేవుడా.. ఎలా బతికేది స్వామీ. ఎంత పనిచేశావయ్యా. బిడ్డలను దిక్కులేని వాళ్లను చేశావు కదయ్యా.' అంటూ కుటుంబ సభ్యులు విలపించడం చూపరులకు కన్నీళ్లను తెప్పించింది. ఈ విషాద సంఘటన ఆదోని మండలం పాండవగల్లు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. రెండు ద్విచక్ర వాహనాలను కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఐదుగురు మృతి చెందారు.

ఆదోని/ఆదోని రూరల్, కర్నూలు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల గర్భిణిగా ఉన్న భార్యకు వైద్యపరీక్షల కోసం ఓ జంట.. చర్మసంబంధిత నాటు వైద్యం కోసం కొడుకుతో కలసి మరో జంట ద్విచక్రవాహనాలపై బయలుదేరారు. ప్రాంతాలు వేరైనా ఇద్దరిది ఒకే అవసరం. వైద్యం చేయించుకోవాలని ప్రయాణమయ్యారు. మరో 15-20 నిమిషాల్లో గమ్యానికి చేరుకోబోతున్నారు. ఎండలు మండుతుండడంతో త్వరగా వెళ్లి వైద్యం చేయించుకొని ఇంటికి చేరుకోవాలని సాగిపోతున్నారు. రెండు బైక్‌లు పాండవగల్లు గ్రామం దాటి జాలిమంచి క్రాస్ రోడ్డుకు చేరుకున్నారు. ఎదురుగా మృత్యుశకటంలా వస్తున్న కర్ణాటక బస్సు వీరి ద్విచక్ర వాహనాలను ఒకదాని తరువాత మరోదాన్ని వేగంగా ఢీ కొట్టింది. బైకులపై వెళ్తున్న ఐదుగురు బస్సు చక్రాలు కింద నలిగిపోయారు. కుప్పగల్లుకు చెందిన యువ రైతు కురవ పూజారి ఈరన్న, అమ్మ గర్భంలో పెరుగుతున్న పిండంతో సహా ఆయన భార్య ఆదిలక్ష్మి, కర్ణాటక రాష్ట్రం మాన్వి పట్టణానికి చెందిన హోంగార్డు మంగలి హేమాద్రి భార్య నాగరత్న, కుమారుడు దేవరాజు అక్కడికక్కడే మృత్యుఒడికి చేరుకున్నారు. రక్తమడుగులో చిక్కుకొని కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న హోంగార్డు హేమాద్రినైనా బతికించాలని పోలీసులు ఆదోని ఆస్పత్రికి చేర్చగా చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డారు. ఆదోని-మంత్రాలయం రహదారి.. రుధిర ధారలతో రక్తసిక్తమైంది. చెల్లాచెదురుగా పడిన మృతదేహాలను చూసిన స్థానికులు 'అయ్యో..! పాపం ఎంత ఘోరం జరిగింది' అంటూ కన్నీరు పెట్టారు. డ్రైవర్ నిర్లక్ష్యం, అతి వేగం ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు నిర్ధారించారు.

మిగతా 7వ పేజీలో



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, డీఎస్పీ



మృతదేహాలను తరలిస్తున్న పోలీసులు



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఇంటర్ పరీక్షలో 739 మంది గైర్హాజరు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 24,729 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. 23,979 మంది పరీక్షకు హాజరు కాగా, ఇందులో 739 మంది గైర్హాజరయ్యారు. కర్నూలు బీ. క్యాంపు ఒకేషనల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ సెంటర్‌లో మాల్ ప్రాక్టీసుకు పాల్పడిన ముగ్గురు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు ఆర్‌ఐవో గురువయ్య శెట్టి తెలిపారు. ఈ సందర్భంగా డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జి. లాలెప్ప, డీఈసీ కమిటీ సభ్యులు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

మెరుగైన ఫలితాలు సాధించండి

డీఈవో శ్యామూల్ పాల్



ప్యాడ్స్ అందజేస్తున్న డీఈవో

చిప్పగిరి మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : చిప్పగిరిలో స్థానిక గవర్నమెంట్ హై స్కూల్‌లో డీఈవో శ్యామల్ పాల్ మంగళవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 1 సావిత్రి, ఎంఈవోటు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. డీఈవో మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో మొత్తం 40వేల 776 విద్యార్థులు ఉన్నారని, 172 సెంటరులు ఏర్పాటు చేశామని, 172 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లను, 172 మంది అసిస్టెంట్ ఆఫీసర్లను ఏర్పాటు చేశామని, చిప్పగిరి మండలంలో 315 మంది విద్యార్థులు ఉన్నారని అన్నారు. పిల్లలు అందరూ బాగా చదువుకొని మంచి ఉత్తీర్ణతతో సాధించాలని, చిప్పగిరి హైస్కూల్‌లో టెన్త్‌క్లాస్ స్టూడెంట్స్‌కు 99విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్స్, రబ్బర్స్, ప్యాడ్స్ డీఈవో చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ లతీఫ్, టీచర్స్ నారాయణ స్వామి, మౌలాలి, రంగనాయకులు పాల్గొన్నారు.

గ్లకోమా.. సైలెంట్ కిల్లర్..

- జిల్లాలో 10 నుండి 15 శాతం కేసులు
- నేడు వరల్డ్ గ్లకోమా డే

6

యువత పోరు జగన్ ఇంటి ముందు చేయాలి

7

కల్యాణం.. వైభోగం...

- ఘనంగా అహోబిల నృసింహుడి కల్యాణోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- 'దిగువ'లో బృందలోలుడి అలంకరణలో ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 11(ఆంధ్రజ్యోతి): భక్తజన వరదా.. జ్వాలా నృసింహ నమోస్తుతే.. గోవిందా.. గోవిందా.. స్మరణతో ప్రముఖ వైష్ణవ క్షేత్రం అహోబిలం పులకించింది. చెంచులక్ష్మి, నరసింహస్వామి వారి కల్యాణోత్సవం మంగళవారం సాయంత్రం కన్నులపండువగా సాగింది. చెంచులక్ష్మి సమేతుడైన వేంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి వేదమంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య ముల్లోకాలు మురిసేలా మూడుముళ్ల బంధంతో జ్వాలా నరసింహస్వామి, చెంచులక్ష్మీ అమ్మవారు ఒక్కటైన మధురక్షణాలు భక్తులను మంత్రముగ్ధుల్ని చేశాయి. ఎగువ అహోబిలంలో అశేష భక్తజన సందోహం మధ్య స్వామి, అమ్మవార్ల తిరు కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్, వేదపండితులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు శాస్త్రోక్తంగా ఎదుర్కోళ్లు నిర్వహించారు. భక్తులు గోవింద నామస్మరణ చేస్తుండగా స్వామి, అమ్మవారికి అర్చకులు కంకణధారణ చేశారు. వేదపండితుల మంత్రాలు, భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాల మధ్య మాంగళ్యధారణ కార్యక్రమం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల పాదాల వద్ద ముత్యాల తలంబ్రాలు పోసి అహోబిలేశుడి తిరు కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా జరిపించారు. పద్మశాలీ సంఘం తరఫున ప్రొద్దుటూరుకు చెందిన అగ్గారపు శివ శంకర్, అరుణ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి స్వామివారి కల్యాణానికి ఉభయదారులుగా వ్యవహరించారు.

'దిగువ'లో నేడు కల్యాణోత్సవం

అహోబిలం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి దిగువ అహోబిలంలో లక్ష్మీనృసింహస్వామి తిరు కల్యాణోత్సవం జరగనుంది. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకం, సాయంత్రం గజ వాహన సేవ జరగనుంది. ఎగువ అహోబిల క్షేత్రంలో జ్వాలా నరసింహస్వామికి అర్చకులు ఉత్సవం, తొట్టి తిరుమంజనం, అశ్వ వాహన సేవ నిర్వహిస్తారు.



ఎగువ అహోబిలంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

వేణుగోపాలుడిగా ప్రహ్లాదవరదుడు

దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదస్వామి వేణుగోపాలుని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేణుగోపాలుని అలంకారంలో స్వామివారు ఉభయదేవేరులకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం పల్లకిలో కొలువై ఆలయ మాడ వీధుల్లో విహరించారు. శ్రీవారిని పట్టువస్త్రాలు, పూలమాలలతో విశేషంగా అలంకరించి రాత్రి పొన్నచెట్టు వాహనంపై కొలువుంచి తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.



ఉభయదేవేరులతో వేణుగోపాలుని అలంకారంలో విహరిస్తున్న స్వామివారు

ఫార్మర్ రిజిస్ట్రీతో విప్లవాత్మక మార్పులు



వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఇక నుంచి ప్రతి రైతుకు ఆధార్ తరహాలో విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధారంగా వ్యవసాయం, అనుబంధ శాఖల పథకాలతో పాటు రాయితీలను వర్తింపజేయనున్నారు. ఇంతకాలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు, సేవలను అందుకుంటున్న అనర్హులకు అడ్డుకోవడం, అర్హులైన రైతులకు నేరుగా లబ్ధి చేకూరేందుకు ఈ విధానాన్ని తీసుకొచ్చారు. ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో ప్రతి రైతుకు 11 అంకెలతో కూడిన నిర్దిష్టమైన గుర్తింపు సంఖ్యను ఇచ్చేందుకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఇప్పటికే జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతులు దరఖాస్తు చేసుకున్నట్లయితే వారికి విశిష్ట సంఖ్యను జారీ చేసే ప్రక్రియ మొదలుపెట్టారు. ఇక నుంచి రైతులకు అందించే పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సేవలను పొందేందుకు ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుంది.



ఆత్మకూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు కేంద్ర ప్రభుత్వం తరపున పలు పథకాలు, రాయితీలు అమలువుతున్నాయి. వీటికిగాను రాష్ట్రాల్లో ఉన్న వ్యవసాయ భూములు, పంటల వివరాలు మాత్రమే కేంద్రానికి సమాచారం అందుతున్నాయి. కానీ వ్యక్తులుగా రైతుల వారీగా పంటలు, పశుసంపద, ఇతర సమాచారం సమగ్రంగా అందడం లేదు. దీనికి ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య కార్డుల జారీ ద్వారా రైతుల పంటలు, వారి వద్ద ఉన్న పశు సంపద, అందుతున్న రాయితీ పథకాలు తదితర సమగ్ర సమాచారం కేంద్ర ప్రభుత్వానికి చేరనుంది. తద్వారా అర్హులైన రైతులకు పారదర్శకంగా పథకాలను, రాయితీలను అందించేందుకు ఈ సంఖ్య దోహదపడనుంది. వాస్తవానికి వ్యవసాయ రంగాన్ని డిజిటలైజ్ చేయడానికి 2024-25 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రూ.2817 కోట్ల నిధును కేటాయించింది. ఈ నిధుల ద్వారా రైతుల విశిష్ట గుర్తింపు కార్డుల జారీకి అవసరమైన సమగ్ర సమాచారాన్ని సేకరించి డిజిటలైజ్ చేయాలని భావిస్తోంది. ఇందుకు దేశంలో మొత్తం 19 రాష్ట్రాలు విశిష్ట గుర్తింపు సంఖ్యతో కూడిన కార్డులను జారీ చేసేందుకు కేంద్రంతో ఒప్పందం చేసుకున్నాయి.

విశిష్ట గుర్తింపు సంఖ్యతో ప్రయోజనాలు ఇలా

రైతు సేవా కేంద్రాల ద్వారా జారీ అయిన విశిష్ట సంఖ్య ద్వారా అవసరమైన సమయాల్లో అర్హులైన రైతులను అధికారులే గుర్తిస్తారు. వారికి ఆయా రాయితీ పథకాలను వర్తింపజేసేందుకు అవగాహన కల్పిస్తారు. ప్రత్యేకించి రైతులకు పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ, రాయితీపై సూక్ష్మపోషకాలు, సూక్ష్మసేద్యం, పంట రుణాలు, పెట్టుబడి సాయం, ధాన్యం కొనుగోలు, సాగునీటి సమస్యలు తదితర పథకాలను పారదర్శకంగా లబ్ధి పొందడమే కాకుండా పంటల తెగుళ్లు, ఇతర వ్యవసాయ సలహాలు, సూచనలు కూడా వ్యవసాయాధికారుల నుంచి నేరుగా పొందేందుకు అవకాశం ఉంటుంది.



బాపనంతాపురం గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకుంటున్న రైతులు

అర్హులు ఎవరంటే..

వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట సంఖ్యను పొందేందుకు అర్హులే. రైతులు తమ అధార్ నంబరు, దానికి అనుసంధానించిన సెల్‌ఫోన్ నంబరు, భూమి రికార్డుల వివరాలు (పట్టాదారు పాసుపుస్తకం) తీసుకొని రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే)లో సంప్రదించినట్లయితే రైతు సమక్షంలోనే వారు ఇచ్చిన ఆధారాలతో ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేయగా సెల్‌ఫోన్‌కు వచ్చే ఓపీటీపీ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేసి విశిష్ట గురింపు సంఖ్య రానున్నారు. ఆ తర్వాత కొన్ని రోజులకు ప్రత్యేక గుర్తింపు కార్డులను కూడా మంజూరు చేయనున్నారు. అందుకే ప్రతి రైతు విధిగా ఆర్ఎస్‌కేలను సంప్రదించి విశిష్ట సంఖ్యను పొందాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఇక నుంచి ఆయా పథకాల లబ్ధికి ఆధార్ కార్డు, ఇతర ధృవీకరణ పత్రాలతో అవసరం లేకుండా నేరుగా విశిష్ట సంఖ్యనే ఉపయోగపడుతుంది. ఈ సంఖ్య లేనట్లయితే రైతులకు పథకాలు వర్తించవని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కాగా ప్రస్తుతం భూమి ఉన్న రైతులకు మాత్రమే విశిష్ట గుర్తింపు సంఖ్య రానుండగా, త్వరలో కౌలు రైతులకు, భూమిలేని వ్యవసాయ కూలీలు, ఇతర వ్యవసాయ ఆధారిత వృత్తుల్లో ఉన్న వారికి కూడా వర్తింపజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

నంద్యాల జిల్లాలో వ్యవసాయ సమాచారం

వ్యవసాయ భూములు	: 4,12,601 హెక్టార్లు
ఉద్యాన భూములు	: 64,263 హెక్టార్లు
పట్టు పరిశ్రమ	: 1023.47హెక్టార్లు
మత్స్య పరిశ్రమ	: 350 హెక్టార్లు
చిన్న, సన్నకారు రైతులు	:2,73,391
మధ్యకారు రైతులు	: 61,638
పెద్ద రైతులు	: 858

విశిష్ట గుర్తింపు కార్డులతో ప్రయోజకరం



ప్రభుత్వం జారీ చేసిన విశిష్ట గుర్తింపు సంఖ్యతో రైతులకు చాలా ప్రయోజనం కలుగుతుంది. ఇంతకాలం ఆధార్ కార్డు ప్రామాణికంగా పథకాల మంజూరు జరిగేవి. అయితే పథకాలు, రాయితీలు మరింత పారదర్శకంగా ఉండేందుకు 11 అంకెలతో కూడిన నెంబర్‌ను ప్రభుత్వం రైతులకు ఇస్తుంది. దీని వల్ల సమగ్ర సమాచారం డిజిటలైజ్ అవుతుంది. రైతు సేవా కేంద్రాల్లో రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ అవుతుంది.

- విష్ణువర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి ఆత్మకూరు



- వ్యవసాయ పథకాల వర్తింపులో పారదర్శకత
- రైతు సేవా కేంద్రాల ద్వారా విశిష్ట గుర్తింపు సంఖ్య

గ్లకోమా.. సైలెంట్ కిల్లర్..

- జిల్లాలో 10 నుండి 15 శాతం కేసులు
- నేడు వరల్డ్ గ్లకోమా డే



కర్నూలు హాస్పిటల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): శరీరంలో అతి ముఖ్యమైన, సున్నితమైన భాగం కన్ను. మనకు దారి చూపే కంటిపై నీటి కాసులు (గ్లకోమా) అనే వ్యాధి గుట్టుచప్పుడు లేకుండా కంటి దొంగలా వచ్చి చూపును దోచేస్తుంది. మన శరీరంలో బీపీ ఎలాంటిదో.. కంటికి ప్రత్యేకంగా గ్లకోమా అలాంటిది. బీపీ పెరిగితే.. గుండె జబ్బులు ఎలా వస్తాయో.. అదే విదంగా కంటిలో ఒత్తిడి పెరిగితే గ్లకోమా వస్తుంది.

గ్లకోమా వల్ల మన దేశంలో 12.8 శాతం ప్రజలను అంధులుగా చేస్తుంది. ఇంత ప్రమాదాన్ని తెచ్చి పెట్టే గ్లకోమా గురించి ఇప్పటి వరకు ప్రజలకు అవగాహన లేదు. అందుకే మార్చి 12వ తేదీ వరల్డ్ గ్లకోమా డే గా గ్లకోమా వారోత్సవాలను ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది గ్లకోమా రహిత ప్రపంచం కోసం ఐక్యత అన్ని నినాదాన్ని ఇచ్చింది.

40 ఏళ్ల తర్వాత :40 ఏళ్లను దాటిన తర్వాత ప్రతి ఒక్కరూ ఒక్కసారి కంటి పరీక్షలు చేయించుకోవాలి. స్మార్ట్ ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌లో పని చేస్తున్నప్పుడు చుట్టూ తగినంత లైటింగ్ ఉండేలా చూసుకోవాలి. చీకటిలో పని చేయకూడదు. ప్రతి అరగంటకు ఐదు నిమిషాల విరామం తీసుకోవాలి.

గ్లకోమా లక్షణాలు

- 40 ఏళ్లు పైబడిన వారు తరచుగా అద్దాలు మార్చాల్సి రావడం, తలనొప్పి రావడం
- మసక వెలుతురులో వస్తువులను గుర్తించడం ఆలస్యం అవడం..
- కంటి చూపు క్రమేపీ తగ్గడం
- వెలుతురు బల్బ్‌ను చూసినప్పుడు వాటి చుట్టూ రంగులు కనిపించడం
- కంటిలో ఒత్తిడి పెరిగినప్పుడు కన్ను ఎర్రగా మారడం

గ్లకోమా నిర్ధారణ

- అక్షరపటం చదివే సాధారణ కంటి పరీక్ష
- స్లీట్ లాంప్ (మైక్రోస్కోప్) పరీక్ష
- అప్లనేషన్ టోనోమీటర్ అనే పరికరంతో కొలుస్తారు. అప్పుడప్పుడు వేరువేరు సమయాల్లో ఒత్తిడి పరీక్షించాల్సిన అవసరం రావచ్చు.
- గ్లకోమా ఏ రకమో నిర్ధారించడానికి కంటి కోణాన్ని గోనియోస్కోప్ అనే పరికరంతో పరీక్షిస్తారు.
- వ్యాధి నిర్ధారణ చేయడానికి ఆటోమేటిక్ ఫీల్డ్ లేదా పెరిమెట్రీ పరీక్ష నిర్వహిస్తారు. తొలి దశలో గ్లకోమాను కేవలం గుర్తించగలుగుతారు.

ఈ జాగ్రత్తలు

- వంశపారంపర్యంగా గ్లకోమా వచ్చే అవకాశం ఉంది. కాబట్టి వీరు క్రమం తప్పకుండా కంటి పరీక్ష, కంటి ఒత్తిడి పరీక్షలు చేయించుకోవాలి.
- స్టెరాయిడ్స్ వాడకం పూర్తిగా తగ్గించాలి
- రక్తపోటు, మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవాలి.
- కంట్లో ఒత్తిడిని తగ్గేందుకు యోగా, వ్యాయామాలు చేయాలి.

ప్రాంతీయ కంటి ఆసుపత్రికి గ్లకోమా కేసులు

కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ప్రతి రోజు 300 నుంచి 400 మంది దాకా ఓపీ రోగులు వస్తుంటారు. ఇందులో అడ్మిషన్‌లు 20 మంది దాకా వార్డులో చేరుతుంటారు. ఇందులో 10 నుంచి 15 శాతం మంది గ్లకోమా వ్యాధి తో బాధపడుతుంటారు.



కంటి ఒత్తిడి వల్ల గ్లకోమా



గ్లకోమా అనేది కంటిలోని ఒత్తిడి పెరగడం వల్ల కలిగే ఆప్టిక్ నాడిని దెబ్బతీసే కంటి వ్యాధుల సమూహం. కంటి నుంచి మెదడుకు దృశ్య సమాచారాన్ని ప్రసారం చేయడానికి బాధ్యత వహించే ఆప్టిక్ నాడికి కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తుంది. సకాలంలో చికిత్స అందించకుంటే పూర్తిగా అంధత్వానికి దారి తీస్తుంది. ఈ వ్యాధికి కంటి మందులు, లేజర్ చికిత్స, శస్త్ర చికిత్స ద్వారా ఉన్న కంటి చూపు దెబ్బతినకుండా కాపాడవచ్చు.

- డా.ఏ. విజయలక్ష్మి, గ్లకోమా స్పెషలిస్టు, సుశీల నేత్రాలయ, కర్నూలు


ప్రతి రోజు గ్లకోమా, రెటీనా పరీక్షలు



కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ఓపీకి వచ్చే రోగులకు కంటి పరీక్షలతో పాటు రెగ్యులర్‌గా గ్లకోమా, రెటీనా పరీక్షలు నిర్వహిస్తాం. ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు వరల్డ్ గ్లకోమా వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. జిల్లా ప్రజలకు గ్లకోమా పై అవగాహన సదస్సులను ఏర్పాట్లు చేస్తున్నాము.

- డా.పృథ్వీ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రి

లక్షణాలు కనిపించవు



ప్రారంభంలో గ్లకోమాకు ఎటువంటి లక్షణలు కనిపించవు. దీన్ని గుర్తించేసరికి వ్యాధి ముదిరిపోతుంది. కంటి నరాల్లో ఒత్తిడి పెరిగి హటాత్తుగా కన్ను నొప్పి రావడం, తలనొప్పి, చూపు మసకబారడం, కాంతి చుట్టూ వలయాలుగా కనిపించడం లక్షణాలు కనిపిస్తాయి. గ్లకోమా వ్యాధి ఉన్న వారు 6 నెలలకు, 40 ఏళ్లు దాటిన వారు ఒక సంవత్సరానిక ఒకసారి పరీక్షలు చేయించుకోవాలి.

- డా.పి. సుధాకర్‌రావు, సీనియర్ కంటి వైద్య నిపుణుడు, సుశీల నేత్రాలయ, కర్నూలు

సంగమేశ్వరంలో స్పీడ్ బోటు బోల్తా

ఎక్స్‌కవేటర్ సాయంతో బయటికి తీసిన అటవీ అధికారులు



నీటమునిగిన స్పీడ్‌బోటును ఒడ్డున చేర్చేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం

కొత్తపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరంలోని కృష్ణానదిలో ఇంకా ప్రారంభానికి నోచుకోని అటవీ శాఖకు చెందిన ఓ స్పీడ్ బోటు అలల తాకిడికి బోల్తా పడింది. ఇటీవలనే అటవీ అధికారులు కాకినాడ నుంచి సంగమేశ్వరం తెచ్చిన నూతన స్పీడ్ బోటును అటవీ అధికారుల పర్యవేక్షణలో సంగమేశ్వరం నుంచి నది జలాల మీదుగా శ్రీశైలానికి పంపించాల్సి ఉంది. ఇంకా ప్రారంభానికి నోచుకోని ఏసీ స్పీడ్ బోట్‌ను నదిలోనే తాళ్లతో కట్టి ఉంచినప్పటికీ అలల తాకిడికి బోల్తా పడి మునిగిపోయింది. గత రెండు రోజులుగా ఆత్మకూరు రేంజ్ అధికారి పట్టాభి పర్యవేక్షణలో సిబ్బందితో పాటు పరిసర ప్రాంతాల మత్స్యకారుల సాయంతో బోటును నది ఒడ్డుకు చేర్చేందుకు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఎట్టకేలకు సోమవారం మధ్యాహ్నం ఎక్స్‌కవేటర్ సాయంత్రం స్పీడ్ బోటును నది ఒడ్డుకు చేర్చారు. సుమారు 14 మంది ప్రయాణించే ఈ స్పీడు బోటుకు ఏమీ కాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

నంద్యాల ఈఎస్ఐని అప్‌గ్రేడ్ చేయండి



కేంద్ర మంత్రితో మాట్లాడుతున్న ఎంపీ శబరి

నంద్యాల హాస్పిటల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా కేంద్రంలో ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ మంగళవారం కేంద్ర శ్రమ, ఉపాధి మంత్రి మాన్‌సున్ మాండవీయను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 3.75 లక్షల మంది కార్మికులు ఉన్నారని, వీరిలో చాలా మంది నిర్మాణ, వ్యవసాయ, తయారీ పరిశ్రమలలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం నంద్యాలలో ఒక ఈఎస్ఐ డిస్పెన్సరీ మాత్రమే ఉందని, ఈ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. దీనివల్ల వేలాది మంది కార్మికులకు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలు, అత్యవసర చికిత్సలు అందుబాటులోకి వస్తాయని మంత్రికి వివరించారు.

పొగాకు రైతుకు తిప్పలు

రాత్రింబవళ్లు జాగరణ

ఓర్వకల్లు మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో పొగాకు బేళ్లను విక్రయించేందుకు రైతులకు తిప్పలు ఎదురయ్యాయి. పొగాకు విక్రయించేందుకు గోడౌన్లు, రహదారులపై రైతులు జాగారణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మంగళవారం పొగాకు విక్రయించేందుకు భారీ వాహనాలు నిలిచిపోయాయి. ఓర్వకల్లు మండలంలో వీఎస్‌టీ, ఐటీసీ బొంబిడాళ్ల, డెక్కల్, రిలయన్స్ కంపెనీలు పొగాకును కొనుగోలు చేస్తున్నారు. పొగాకు బేళ్లను విక్రయించేందుకు నంద్యాల, కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాలు తెలంగాణ రాష్ట్రంలోని రాయచూరు తదితర రైతులు పొగాకు విక్రయించేందుకు ఓర్వకల్లుకు వస్తున్నారు. అయితే.. పొగాకు రైతులకు భోజన వసతి, నీటి సౌకర్యం కల్పించాల్సి ఉండగా.. ఒకే ఒక కంపెనీ జీపీఐ మాత్రమే రైతులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. మిగతా ఆరు కంపెనీలు రైతులను పట్టించుకునే దాఖలాలే కరువయ్యాయి. పొగాకు నాటే ముందు ప్రతి రైతు పొగాకును కొంటామని వాగ్దానం చేసిన కంపెనీలు నేడు తడి ఉందని పొగాకు వెనక్కు పంపడంతో రాను పోను రవాణా చార్జీల భారం పెరుగుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పొగాకు క్వింటం రూ.16వేలకు కొనుగోలు చేయాలని ఆయా కంపెనీలను రైతులు కోరారు. విక్రయించేందుకు వచ్చే రైతులకు కంపెనీ యజమాన్యం భోజనం, మంచి నీటి సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.



ఓర్వకల్లులో పొగాకును విక్రయించేందుకు భారీగా నిలిచిన వాహనాలు

రుధిర ధారులు

(5వ పేజీ తరువాయి)

ఆదోని మండలం పాండవ గల్లు గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆదోని మండలం కుప్పగల్లు గ్రామానికి చెందిన యువరైతు దంపతులు కురవ పూజారి ఈరన్న (25), మూడు నెలల గర్భవతి పూజారి ఆదిలక్ష్మి (వీరిద్దరు టీడీపీ కార్యకర్తలు), కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాన్వి పట్టణంలో అగ్నిమాపక విభాగంలో హోంగార్డుగా పని చేస్తున్న మంగలి హేమాద్రి (40), ఆయన భార్య నాగరత్న (35), కుమారుడు మంగలి దేవరాజు (20) ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. కుప్పగల్లుకు చెందిన పూజారి ఈరన్న భార్య పూజారి ఆదిలక్ష్మి మూడు నెలల గర్భవతి. ఆమెకు స్వల్పంగా రక్తస్రావం అవుతుండడంతో ఆదోనిలో చికిత్స, నెలవారి వైద్య పరీక్షల కోసం మూడేళ్ల కూతురు సుస్మితను అవ్వతాతలు వీరేషమ్మ, రామన్నల వద్ద వదిలిపెట్టి.. ఉదయం 9:30 గంటల సమయంలో ఏపీ21 బీజే 4324 ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. అలాగే చర్మ సంబంధిత జబ్బుకు ఆదోని మండలం ఇస్విలో నాటు వైద్యం కోసం తెల్లవారుజామునే కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాన్వి పట్టణానికి చెందిన అగ్రిమాపక శాఖ హోంగార్డు మంగలి హేమాద్రి (40) భార్య నాగరత్న (35), కుమారుడు మంగలి దేవరాజు (20)తో కేఏ 36 హెచ్‌డీ 8129 మోటర్ బైక్‌పై బయలుదేరారు. ఈ రెండు జంటలు వెళ్తున్న బైకులు సుమారుగా 10 గంటల సమయంలో పాండగల్లు గ్రామం దాటి జాలిమంచి క్రాస్ రోడ్డు చేరుకున్నాయి. మరో 15-20 నిమిషాల్లో గమ్యానికి చేరుకోబోతుండగా.. అదే సమయంలో ఎదురుగా వస్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు కేఏ 37 ఎఫ్ 0711 వీరి ద్విచక్ర వాహనాలను ఒకదాని తరువాత ఒకదాన్ని వేగంగా ఢీకొంది. బైకులను ఢీకొట్టిన బస్సు.. అదే వేగంలో పొలంలోకి దూసుకెళ్లి ఓ వేపచెట్టును ఢీకొట్టగా ఆ చెట్టు వేళ్లతో సహా ధ్వంసమైంది. కుప్పగల్లుకు చెందిన భార్యభర్తలు ఈరన్న, ఆదిలక్ష్మి మృతదేహాలు బస్సు చక్రాల కిందే నలిగిపోగా.. మాన్వికి చెందిన తల్లికొడుకులు నాగరత్న, దేవరాజుల మృతదేహాలు రోడ్డు పక్క చెల్లాచెదురుగా పడిపోయాయి. తీవ్రమైన గాయాలతో రక్తపుమడుగులో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న హోంగార్డు మంగలి హేమాద్రిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినా ప్రయో జనం లేకపోయింది. చికిత్స పొందుతూ నిమిషాల్లోనే ఊపిరి వదిలారు. మృతుల బంధువులతో ఆస్పత్రి శోకసంద్రంగా మారింది.


మృతి చెందిన హేమాద్రి


అక్కడికక్కడే మృతిచెందిన నాగరత్న


ప్రమాద స్థలంలో విగత జీవిగా పడి ఉన్న దేవరాజు


గుండెలవిసేలా రోదిస్తున్న మృతుల బంధువులు

ఊరుగాని ఊళ్లో మృత్యువాత

కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాన్వి పట్టణంలో మంగలి హేమాద్రి అగ్నిమాపక శాఖలో హోంగార్డుగా పని చేస్తున్నారు. భార్య నాగరత్న, కొడుకు దేవరాజు, నలుగురు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూరుతుకు పెళ్లి చేయగా.. మిగిలిన ముగ్గురు కూతుళ్లు 7,8,10వ తరగతి చదువుతున్నారు. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న దేవరాజు స్థానిక సెలూన్ షాపులో కులవృత్తి పని చేస్తూ నాన్నకు తోడుగా ఉన్నాడు. హేమాద్రికి చర్మసంబంధిత సమస్యలు తలెత్తాయి. అక్కడి డాక్టర్లకు చూపించిన తగ్గకపోగా.. రోజురోజుకు పెరుగుతూ రావడంతో.. ఆదోని మం డలం ఇస్వీ గ్రామంలో నాటు వైద్యం చేస్తారు. తగ్గిపోతుందని తెలిసిన వాళ్లు చెప్పడంతో.. మంగళవారం సెలూన్ షాప్‌కు సెలవు ఉందని దేవరాజు బైక్‌పై నాన్న హేమాద్రి, అమ్మ నాగరత్నలను ఎక్కించుకొని దాదాపు 100 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఇస్వీకి బయలుదేరారు. ఊరుగాని ఊళ్లో రోడ్డు ప్రమాదానికి తల్లిదం డ్రులు, కొడుకు ముగ్గురు విగతజీవులుగా మారారు. కన్నవాళ్లను కోల్పోయి..మాకెవ్వరు దిక్కు అంటూ కుమార్తెలు బోరున విలపించారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న మీనాక్షి నాయుడు

మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ విచారం

పాండవగల్లు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడడంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌లు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. కర్ణాటక బస్సు ఢీకొని కుప్పగల్లుకు చెందిన టీడీపీ కార్యకర్తలు పూజారి ఈరన్న, ఆదిలక్ష్మి దంపతులు, కర్ణాటక వాసులు ముగ్గురు మృతి చెందడం అత్యంత బాధాకర మని లోకేశ్ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై ఆధికా రులు, ఆదోని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినా యుడులను వాకాబు చేశారు. టీడీపీ కార్యకర్తల కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా ప్రమాద ఘటనపై ఎస్పీ, కలెక్టర్లతో మంత్రి టీజీ భరత్ మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు ఆస్పత్రికి చేరుకొని రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలను పరామర్శించారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

పాండగల్లు రోడ్డు ప్రమాద ఘటనా స్థలాన్ని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కర్ణాటక ఆర్టీసీ బస్సును, ఘటన స్థలంలో చెల్లాచెదురుగా పడిపోయిన ద్విచక్రవాహనాలను తనిఖీ చేశారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎస్పీ వెంట ఆదోని డీఎస్పీ హేమలత, ఆదోని రూరల్ సీఐ నల్లప్ప, పెద్దతుంబళం మహేశ్‌కుమార్ ఉన్నారు.

14 మంది ప్రాణాలు పాడిన వేప చెట్టు

బస్సులోని 14మంది ప్రయాణికులను ఓ వేపచెట్టు కాపాడింది. ఆదోని నుంచి మంత్రాలయానికి వేగంగా వెళ్తున్న కర్ణాటక బస్సు ప్రమాదం జరిగిన స్థలానికి ముందు ఉనన కల్వర్టును దాటే క్రమంలో వేగాన్ని నియంత్రించుకోలేక డ్రైవర్ ఎడమ నుంచి కుడికి బస్సును తిప్పడం.. అదే సమయంలో రోడ్డుకు వెళ్తున్న మోటర్ బైక్‌లను ఢీకొట్టి.. పొలాల్లోకి దూసుకుపోయి వేప చెట్టును ఢీకొట్టి బస్సు ఆగిపోయింది. చెట్టు వేళ్లతో సహా కింద పడిపోయిందంటే ఎంత వేగంతో ఢీకొట్టి ఉంటుందో అంచనా వేయవచ్చు. చెట్టే లేకపోయి ఉంటే బస్సు పల్టీలుకొట్టి 14 మంది చనిపోయేవారు.

దటీజ్ పోలీస్..

పాండవగల్లు దగ్గర రోడ్డు ప్రమాదం జరిగిందనే సమాచారం రాగానే ఆదోని డీఎస్పీ హేమలత, ఆదోని రూరల్ సీఐ నల్లప్ప, వన్‌టౌన్ సీఐ శ్రీరామ్, పెద్దతుంబళం ఎస్ఐ మహేశ్ కుమార్ సహా సిబ్బంది హుటాహుటినా ఘటన స్థలానికి చేరుకున్నారు. పొలంలో వేప చెట్టును ఢీకొని కర్ణాటక ఆర్టీసీ బస్సు ఆగిపోయింది. క్షతగాత్రులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. వాళ్లు బతికే ఉన్నారా..! అంటూ ఒక్కొక్కరిని పరిశీలించారు. రక్తపు మడుగులో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న కర్ణాటక వాసి హోంగార్డు హేమాద్రిని పోలీస్ జీపులో ఎక్కించి ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుప్పగల్లుకు చెందిన భార్యభర్తలు పూజారి ఈరన్న, ఆదిలక్ష్మి, కర్ణాటక రాష్ట్రం మన్వికి చెందిన నాగరత్న, దేవరాజు ఘటన స్థలంలోనే మృతి చెందారని పోలీసులు నిర్ధారించుకొని.. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఆస్పత్రికి తరలించేందుకు ఆటోలు సిద్ధం చేశారు. అప్పటికే వందలాది మంది చేరుకొని 'అయ్యో పాపం.. ఎంత ఘోరం జరిగింద'ని జాలి చూపుతున్నారే తప్పా.. మృతదేహాలను ఆటోలో ఎక్కించేందుకు ఏ ఒక్కరు కూడా ముందుకు రాలేదు. సీఐలు నల్లప్ప, శ్రీరాం, ఎస్ఐలు మహేశ్‌కుమార్, నాగేంద్ర, రామాంజనేయులు మృతదేహాలను ఆటోలోకి చేర్చారు. స్థానికులు ఒకరిద్దరు పోలీసులకు సహకరించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ గంగవతికి చెందిన మహ్మద్ సాబ్‌లాతి ప్రమాదం జరిగిన వెంటనే పారిపోయారని పోలీసులు తెలిపారు.

అయ్యో సుస్మిత..!



ఆదోని మండలం కుప్పగల్లు గ్రామానికి చెందిన రైతు దంపతులు కురవ పూజారి రామన్న, వీరేశమ్మ దంపతులకు ఏకైక కుమారుడు పూజారి ఈరన్న. తమకున్న పొలంలో సేద్యం చేస్తూ జీవనం సాగిస్తు న్నారు. అదే మండలం కె.నాగులాపురం గ్రామానికి చెందిన చిన్న ఉచ్చీరప్ప, ఉరుకుందమ్మ దంపతుల కుమార్తె ఆది లక్ష్మితో నాలుగేళ్ల క్రితం ఈరన్న వివాహం జరిపించారు. వీరికి మూడేళ్ల సుస్మిత సంతానం. ఆదిలక్ష్మి మళ్లీ గర్భం దాల్చింది. మూడు నెలల గర్భవతి ఆదిలక్ష్మికి స్వల్పంగా రక్తస్రావం కావడం, నెలవారి వైద్య పరీక్షల కోసం ఆదోని వెళ్తతూ ఈ ప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు చేరుకున్నారు. 'మమ్మీ, డాడీ ఎప్పుడు వస్తారు..' అని ఆ చిన్నారి అడుగుతుంటే.. సమాధానం చెప్ప లేని స్థితిలో బంధువులు విలపించారు. అమ్మానాన్నలు లేరని, తోబుట్టువు ఇక రాదని తెలియక అమాయకంగా.. దీనంగా చూస్తున్న ఆ చిన్నారి తల్లిదండ్రుల కోసం ఎదురుచూసింది.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి

కొత్తపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపురం గ్రామ శివారులో హరికృష్ణ యాదవ్ (35) అనే వ్యక్తి బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొని మంగళవారం రాత్రి మృతి చెందారు. బంధువులు, గ్రామస్థులు తెలిపిన వివరాలివీ.. శివపురం గ్రామానికి చెందిన హరికృష్ణ యాదవ్ ఆత్మకూరు మండలం కొట్టాలచెరువులో బంధువుల లింగస్వామి దేవుడి కార్యక్రమం నిర్వహిస్తుండగా.. ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో బైకుపై వస్తూ మంగళవారం రాత్రి శివపురం గ్రామ శివారులోని జంబులమ్మ గుడి వద్ద ఉన్న ఓ విద్యుత్ స్తంభాన్ని బైక్‌పై అదుపు తప్పి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హరికృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. కోలుకోలేక మృతి చెందారు. హరికృష్ణకు భార్య కొడుకు, కూతురు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఆత్మకూరు రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈమండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన షేక్ ముర్తుజావలి (25) మంగళ వారం విద్యుదాఘాతతో మృతి చెందాడు. ఆత్మకూరు ఏఎస్ఐ శంకర్ రెడ్డి తెలిపిన వివరాలివీ.. మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెం దిన షేక్ ముర్తుజావలి తాను చేస్తున్న గౌండా పని ముగించుకుని సాయంత్రం మంగళవారం ఇంటికి వచ్చి ఇంట్లో స్నానం చేస్తున్న సమయంలో బాత్‌రూంలో ఉన్న ఓ వైరు మీద టవల్ ఆరవేశాడు. స్నానం పూర్తయిన తర్వాత ఆ టవల్ తీసుకునే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. ఇది గమనించిన ఇంట్లోని కుటుంబసభ్యులు హుటాహుటిన ముర్తుజాను గ్రామస్థుల సహకారంతో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే షేక్ ముర్తుజా మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడు ముర్తుజాకు భార్య ఆసియాతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. యువకుడి తండ్రి షేక్ మహబూబ్ బాషా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.


ముర్తుజావలి (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..

నందవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకల దోన గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలివీ.. చిలకలదోన గ్రామ సమీపంలో ఉన్న కేజీబీవీ పాఠశాల దగ్గర రోడ్డు దాటుతున్న వ్యక్తిని బెంగళూరు నుంచి మంత్రాలయం వెళ్తున్న కర్ణాటకకు చెందిన బస్సు ఢీకొట్టింది. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 లోపు ఉంటుందని పింక్ కలర్ ఫుల్ హాండ్ టీ షర్ట్, గ్రే కలర్ లోయర్ దానిపైన రెడ్ కలర్ షార్ట్ వేసుకున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121101150 కు ఫోన్ చేయాలని పోలీసులు తెలిపారు.

రాయలసీమ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి

- పార్లమెంట్‌లో ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూలు అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కరువుతో పోరాడుతున్న రాయలసీమను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఎంపీ బస్తిపాటి నాగారాజు కోరారు. మంగళవారం పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ సరైన నీటి వసతులు లేక సీమ జిల్లాలు కరువుతో అల్లాడుతున్నాయని అన్నారు. రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, కేవలం 25 శాతం మాత్రమే పంటలు సాగవుతుండటంతో ప్రతి ఏడాదీ రైతుల, వ్యవసాయ కూలీలు, ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారని తెలిపారు. రాయలసీమలోన నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని అందులో భాగంగా పోలవరం, బనకచర్ల నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు: ఎస్పీ

ఆలూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆలూరు పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను సీఐ వెంకట చలపతి, ఎస్ఐ దిలీప్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆలూరు సబ్ జైలు 15 ఏళ్లుగా మరమ్మతుల పేరిట మూతపడిందని విలేక రులు ప్రస్తావించగా, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఎస్పీ చెప్పారు.


ఆలూరులో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

హొళగుంద: సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. హొళగుంద పోలీస్ స్టేషన్, మార్లమాడికి చెకపోస్టును పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

విచారించి కేసులు నమోదు చేస్తాం

జర్నలిస్టులపై కొందరు ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఎస్పీ విక్రాంత్ పాటిల్ దృష్టికి తీసుకువెళ్లారు. విచారణ చేసి కేసులు నమోదుచేస్తామని, నిజాయితీగల వ్యక్తులపై అక్రమ కేసులు నమోదు చేస్తే ఆ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేసామని ఎస్పీ చెప్పారు. ఆలూరు సీఐ వెంకటచలపతి, ఎస్ఐ బాల నరసింహులు, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ అక్బరుద్దీన్ పాల్గొన్నారు.

యువత పోరు జగన్ ఇంటి ముందు చేయాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ దొంగల ముఠా అంతా కలిసి జగన్ ఇంటి ముందు యువత పోరు ధర్నా చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఈనెల 12న తలపెట్టిన యువత పోరు నాటకాన్ని తాడేపల్లిలోని జనగ్ ఇంటి ముందు ప్రదర్శించాలని ఎద్దేవా చేశారు. గతంలో జగన్ విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజ్ రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన సకాలంలో చెల్లించకుండా విద్యార్థుల చేతికి సరైన సర్టిఫికెట్లను అందకుండా చేసి ఎంతోమంది విద్యార్థులను రోడ్డు పాలు చేశారని అన్నారు. ఇప్పుడేమో విద్యార్థుల పట్ల మొసలి కన్నీరు కార్చేందుకు యువత పోరు పేరుతో పిలుపు ఇచ్చారని ధ్వజమెత్తారు. 2014-2019 టీడీపీ పాలనలో ఏటా ఫీజు రీయింబర్స్ మెంట్ పంపిణీ చేస్తే జగన్ పాలనలో కేవలం 9 లక్షల మందికి.. అదీ విడతల వారీగా ఇచ్చారని మండి పడ్డారు.

ఇంటర్ పరీక్షకు 739 మంది గైర్హాజరు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 24,729 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. 23,979 మంది పరీక్షకు హాజరు కాగా, 739 మంది గైర్హాజరయ్యారు. కర్నూలు బి.క్యాంపు ఒకేషనల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ సెంటరులో మాల్ ప్రాక్టీసుకు పాల్పడిన ముగ్గురు విద్యార్థులపై మాల్ ప్రాక్టీసు కేసు నమోదు చేసినట్లు ఆర్ఐవో గురువయ్య శెట్టి తెలిపారు. ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి ఆధ్వర్యంలో డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జీ.లాలెప్ప, డీఈసీ కమిటీ సభ్యులు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

పోలీస్ స్టేషన్లకు 'పది' ప్రశ్న పత్రాలు

- పర్యవేక్షించిన డీఈవో, డీవైఈవోలు


ప్రశ్నపత్రాల తరలింపును పర్యవేక్షిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య 10వ తరగతి ప్రశ్నపత్రాలను జిల్లాలోని 12 రూట్‌లలోని ఆయా పోలీస్‌స్టేషన్‌లకు మంగళవారం తరలించారు. డీఈవో జనార్దన్‌రెడ్డి, డీవైఈవోలు శంకర్‌ప్రసాద్, వెంకట్రామిరెడ్డి, రూట్ ఆఫీసర్, మండల విద్యాధికారి రామసుబ్బయ్య పర్యవేక్షణలో శ్రీశైలం, ఆత్మకూరు, మహానంది, పగిడ్యాల, నంద్యాల వన్‌టౌన్, టూటౌన్, ఆళ్లగడ్డ, బేతంచర్ల, డోన్, ప్యాపిలి, నందికొట్కూరు, బనగానపల్లె సంబంధిత పోలీస్ స్టేషన్‌లకుతరలించారు.

ఒక్కో రూట్‌కు ఒక కానిస్టేబుల్, ఇద్దరు ఎంఈవోల చొప్పున కట్టుదిట్టమైన భద్రత మధ్య సంబంధిత రూట్‌లోని పోలీస్ స్టేషన్‌లకు చేరుకుని అక్కడ వాటిని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు.

వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయండి

- రోగులకు మెరుగైన సేవలు అందించాలి
- మాతృ మరణాలు జరగకుండా వైద్య సేవలందించాలి
- కలెక్టర్ పి. రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గర్భిణుల నమోదులో 85 శాతంలోపు పురోగతి చూపిన మండల వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా డీఎంహెచ్‌వోను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో వైద్య ఆరోగ్య అంశాలపై వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన జిల్లా అధికారులు, జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మెడికల్ ఆఫీసర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణిలను వంద శాతం పోర్టల్‌లో నమోదు చేసి వారికి సరైన వైద్యసేవలందించి మాతృమరణాలు జరగకుండా చూడాలని అన్నారు. చిప్పగిరి మండలంలో 89 శాతం మాత్రమే గర్భిణిలను రిజిస్టర్ చేశారని, సమస్య ఏమిటని మెడికల్ ఆఫీసర్‌ను ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిం చాలన్న లక్ష్యంతో పని చేస్తోందన్నారు. నవజాత శిశువులను రిజిస్టర్ నమోదు, వైద్యసేవలు అందించడంతో కూడా ప్రత్యేక దృష్టి పెట్టాల న్నారు. ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) సర్వేకు సంబంధించి కూడా జనాభా అంతటికి పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలని వైద్యధికారులను ఆదేశించారు. సర్వేలో కోసిగి, తుగ్గలి మండలాలు వెనుకబడి ఉన్నాయని, పురోగతి సాధించాలన్నారు. ఎక్కడైనా ఏఎన్ఎంలు తక్కువగా ఉంటే డిప్యుటేషన్ చేసి రేషనలైజేషన్ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఎంహెచ్‌వో శాంతికళ, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టి నరసమ్మ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సెక్రటరీలకు గ్రేడ్-3 పదోన్నతి ఇవ్వాలి

డీఎంహెచ్‌వో ఆఫీసు ఎదుట ధర్నా

కర్నూలు హాస్పిటల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాల యాల్లో పని చేస్తున్న హెల్త్ సెక్రటరీలకు గ్రేడ్-3 పదోన్నతి కల్పించాలని కోరుతూ మంగళవారం డీఎం హెచ్‌వో కార్యాలయం ఎదుట హెల్త్ సెక్రట రీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సెక్రటరీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సంధ్యా రాణి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, జిల్లా అధ్యక్షుడు రాధా కృష్ణ మాట్లాడుతూ కడప జిల్లాలో పదోన్న తులు ఇచ్చినప్పటికీ మిగిలిన జిల్లాలో ఇవ్వక పోవడం అన్యాయమన్నారు. పదోన్నతులు ప్రక్రియ ఆలస్యమయ్యే కొద్ది ఉద్యోగులు నష్టపోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పదో న్నతుల ప్రక్రియ చేపట్టాలని కోరారు. అనం తరం డీఎంహెచ్‌వో పి.శాంతికళకు వినతి పత్రం అందజేశారు. త్వరలోనే హెల్త్ సెక్రటరీలకు పదోన్నతులు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వర రావు, అసోసియేషన్ నాయకురాలు వెంకటే శ్వరమ్మ, గౌరి పాల్గొన్నారు.


డీఎంహెచ్‌వో ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న హెల్త్ సెక్రటరీలు

పన్ను వసూలుకు వినూత్న ఆలోచన

డ్రస్ సర్కిల్ ఎదుట కార్పొరేషన్ అధికారుల నిరసన


డ్రస్ సర్కిల్ ఎదుట నిరసన
తెలుపుతున్న కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు

కర్నూలు న్యూసిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో పేరుకుపోయిన లక్షలాది రూపాయాల బకాయిలు రాబట్టేందుకు అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ వినూత్న కార్యక్రమానికి నాంది పలికారు. మంగళవారం అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లోని డ్రస్ సర్కిల్ వాణిజ్య సముదాయానికి సంబంధించి రూ.6.79 లక్షల బకాయిలను చెల్లించకపోవడంతో డ్రస్ సర్కిల్ ఎదుట అడిషనల్ కమిషనర్, రెవెన్యూ అధికారులు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే బకాయిలు చెల్లించకపోతే నగర పాలక నుంచి పొందుతున్న సదుపాయాలన్నీ నిలిపివేస్తామని హెచ్చరించారు. దీంతో స్పందించిన యాజమాన్యం సాయంత్రం లోపు బకాయిలను చెల్లిస్తామని లిఖితపూర్వక లేఖను అందించారు. అదే విధంగా మేడం కాంపౌండు వాణిజ్య సముదాయాలకు సంబంధించి రూ.5.57 లక్షల బకాయిలను చెల్లించాలని లేనిపక్షంలో తదుపరి చర్యలు తీసుకుంటామని యజమాని ఎం.ఉత్తమ్ కుమార్‌ను కూడా హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఓ జునైద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు భార్గవ్, తిప్పన్న, ఆర్.రాజు పాల్గొన్నారు.

గూడూరును అభివృద్ధి చేయండి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నగర అభివృద్ధి కమిటీ సభ్యులు

గూడూరు మార్చి 11(ఆంధ్రజ్యోతి): గూడూరు నగర పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని నగర అభివృద్ధి కమిటీ సభ్యులు నగర కమిషనర్ రమేష్‌బాబును కోరారు. మంగళవారం నగర పంచాయతీ చైర్మన్ జె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నగర అభివృద్ధి కమిటీ సభ్యులు కమిషనర్ రమేష్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ గూడూరులో రోడ్ల విస్తరణ చేపట్టాలని, తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ కన్వీనర్ నాగరత్నరావు, సుభాకర్, దండు సుందర రాజు, రామాంజనేయులు, చరణ్‌కుమార్, ఎస్‌ఈ బాస్కర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై ఎంపీ బస్తిపాటి దిగ్భ్రాంతి

కర్నూలు అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం పాండవగల్లు వద్ద చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం ఢిల్లీ పార్లమెంట్ సమావేశాలలో పాల్గొంటున్న ఆయన ఫోన్ ద్వారా రోడ్డు ప్రమాద ఘటన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కర్ణాటక ఆర్టీసీ బస్సు, రెండు బైకులను ఢీకొన్న ఘటనలో కుప్పగల్‌కి చెందిన భార్యా భర్తలు, కర్ణాటకలోని ఇస్వీకి చెందిన తల్లి, తండ్రి, కుమారుడు ఒకేసారి మరణించడం మనసును తీవ్రంగా కలిచి వేసిందన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఆందోళనను జయప్రదం చేయండి: సీఐటీయూ


మాట్లాడుతున్న అంజిబాబు

కర్నూలు న్యూసిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈనెల 14న కేంద్ర కార్మిక సంఘాల అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశం లో అంజిబాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం బడ్జెట్‌లో నిదులు కేటాయించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నాలు మానుకోవాలని, కేంద్ర ప్రభుత్వం కేటాయిం చిన 11 వేల కోట్లు విశాఖ ఉక్కు అభివృద్ధికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి నాగన్న, సాయిబాబ, ఈశ్వర్ పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలి


ఆర్‌యూ వీసీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు కోరారు. మంగళవారం ఆర్‌యూలో జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులుతో కలిసి ఉపకులపతి వెంకట బసవరావును కలిసి వినతి పత్రం అందజేశారు. రాంబాబు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, బీఆర్ అంబేద్కర్ లాంటి మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, ఉద్యోగులు రమేష్‌యాదవ్, నాగేశ్వరరావు, వెంకటస్వామి, రోజా, మాలిక్, రాముడు, బెస్తసాధికార కమిటీ జిల్లా కన్వీనర్ పీజీ వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

కర్నూలు అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో సూపరింటెండెంట్ సుధీర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించే ప్రక్రియ బహిరంగ వేలంలో పాల్గొనే వ్యక్తులు ఆధార్, ధరావత్తు సొమ్ముతో పాల్గొనాలని పేర్కొన్నారు. 19 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, ఒక కారుకు వేలం వేస్తున్నట్లు తెలిపారు.

జీజీహెచ్‌కు ఐదు స్ట్రెచర్లు విరాళం


స్ట్రెచర్లు అందుకుంటున్న కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో ఉన్న విజయదుర్గ కార్డియాక్ కేర్ సెంటర్ డైరెక్టర్ సీనియర్ కార్డియాలజిస్టు డా.వసంత కుమార్ కర్నూలు జీజీహెచ్‌కు ఐదు స్ట్రెచర్లను విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఐదు స్ట్రెచర్లను అందించిన డాక్టర్ వసంత కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కొత్త వచ్చిన స్ట్రెచర్లను అత్యవసర విభాగాలను అందించను న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హాస్పటల్ అడ్మినిస్ట్రేటర్లు సింధు సుబ్రహ్మణ్యం, డాక్టర్ శివబాల, హెల్త్ ఇన్‌స్పెక్టర్ టీ.గోవిందు స్వామి పాల్గొన్నారు.

జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహేంద్ర


నియామక పత్రం అందుకుంటున్న మహేంద్ర

కర్నూలు కలెక్టరేట్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహేంద్ర నియమితులయ్యారు. విజయవాడలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలమ్మ ఆదేశాల మేరకు ఏపీ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మమత నాగిరెడ్డి సూచనలు మేరకు ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయభాను, రాష్ట్ర అధ్యక్షుడు లక్క రామారావు చేతుల మీదుగా మహేంద్ర నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మహేంద్ర రాష్ట్ర జిల్లా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈయన దేవనకొండ మండల భైరవకుంట గ్రామ వాసి, 2010లో ఏఐఎస్‌ఎఫ్‌లో చేరి 2011లో కర్నూలు సిటీ అధ్యక్షుడిగా.. 2014లో కర్నూలు నగర ప్రధాన కార్యదర్శిగా 2015లో రాయలసీమ యూని వర్సిటీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. అనం తరం 2022 సంవత్సరంలో డీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. 2025లో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

బైరెడ్డి శబరికి బుడగ జంగాల సంఘం కృతజ్ఞతలు

కర్నూలు అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి కమిటీల పేరుతో బుడగ జంగాలకు అన్యాయం జరుగుతోందని ఎంపీ బైరెడ్డి శబరి మంగళవారం పార్లమెంట్ సమావేశాల్లో ఆమె గళం విప్పడంపై ఆంధ్రప్రదేశ్ బేడ బుడగ జంగాల సంక్షేమ సంఘం తరపున తూర్పాటి మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ హోదాను పునరుద్ధరించాలని సోషల్ జస్టిస్ ఎంపవర్మెంట్ డిపార్టమెంట్ మంత్రికి, సభాపతికి బుడగ జంగాల జీవన విధానాన్ని, నష్టపోతున్న సంక్షేమ ఫలాలు, ఉద్యోగ అవకాశాలు గురించి వివరించారని తెలిపారు. పక్కనే ఉన్న మహారాష్ట్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో ఉన్న బుడగ జంగాలకు ఎస్సీ హోదా ఉన్నప్పటికి రాష్ట్రంలో మాత్రమే ఎందుకు వర్తించ ఆలోచించాలని ఆమె కోరారని మనోహన్ తెలిపారు.

రేపు సాయిబాబా ఆలయంలో పూజలు

కర్నూలు కల్చరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని షిరిడీ సాయిబాబా దేవస్థానంలో గురువారం హోలీ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం సాయి సంఘ్ సేవక్ ఎస్‌జీ మహబలేష్ మంగళవారం తెలిపారు. గురువారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ఉంటాయని, సాయంత్రం 6.30 గంటలకు సంధ్యా హారతి, 7 గంటలకు హోలీ దహనం, 8 గంటలకు సాయిబాబా పల్లకీ సేవ ఉంటాయని తెలిపారు. అనంతరం భక్తులకు అల్పాహారం పంపిణీ ఉంటుందని, సాయి భక్తులు ఈ కార్యక్రమాలకు హాజరు కావాలని మహబలేష్ కోరారు.

నాటుసారాను నిర్మూలిద్దాం

ఎక్సైజ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి


మాట్లాడుతున్న అధికారులు

ఓర్వకల్లు మార్చి 11(ఆంధ్రజ్యోతి): నాటుసారాను నిర్మూలిద్దామని ఎక్సైజ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషనర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం మండలంలోని గుడుంబాయితండా, గుమితంతండా గ్రామాల్లో నాటుసారాపై గ్రామ సభ నిర్వహించి గిరిజనులకు అవగాహన కల్పించారు. సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం గ్రామ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రజల సహకారంతో నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సుధీర్‌బాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణా రెడ్డి, సీఐలు, చంద్రహాస్, రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

హొళగుంద పీహెచ్‌సీ ఆఫీసర్‌గా బి.చంద్రశేఖర్


బి.చంద్రశేఖర్

కర్నూలు హాస్పిటల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హొళగుంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (గెజిటెడ్)గా బి.చంద్రశేఖర్ పదోన్నతి పొందారు. ఈయన గత మూడేళ్లుగా నంద్యాల జిల్లా ఎర్రమఠం పీహెచ్‌సీలో ఎంపీహెచ్‌ఈఓగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం వైద్యఆరోగ్య శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న 56 మంది ఎంపీహెచ్‌ఈవో పీహెచ్‌ఎన్ (టీచింగ్)లకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డా. పద్మావతి విజయవాడ నుంచి జూమ్ కౌన్సెలింగ్ నిర్వహించి పదోన్నతులు కల్పించారు. 56 మందిలో కర్నూలు జిల్లా నుంచి ఖాళీగా ఉన్న ఏకైక స్థానం హొళగుంద పీహెచ్‌సీలో సీహెచ్‌వోగా బి.చంద్రశేఖర్‌కు పోస్టింగ్ ఇచ్చారు. బి.చంద్రశేఖర్ నంద్యాల జిల్లా తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. పదోన్నతి పొందిన బి. చంద్రశేఖర్‌కు తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.

లావుబాలీ దర్గాలో ముగిసిన ప్రార్థనలు


తరావీహ్ నమాజ్ చేస్తున్న ముస్లింలు

కర్నూలు కల్చరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని హజ్రత్ లతీఫ్ లావుబాలీ (రహ్మత్ ఉల్లాహి అలైహి) దర్గా, మసీదులో మూడు రోజుల తారావీహ్ ప్రార్థనలు మంగళవారంతో ముగిసినట్లు మత పెద్దలు తెలిపారు. ఈ పవిత్ర తరావీహ్ ప్రార్థనల్లో ఖురాన్ అకాడమీ వ్యవ స్థాపకుడు డాక్టర్ సయ్యద్ రిజ్వాన్ పాషా ఖాద్రి మూడురోజుల్లో సంపూర్ణ ఖురాన్ తిలావత్ చేశారు. ఈ ప్రార్థనలకు ముస్లింలు హాజరై, ఖురాన్ తిలావత్ చేస్తూ ప్రత్యేక దువాలను చేశారు. తదనంతరం భక్తులు, అనుచరులు డాక్టర్ సయ్యద్ రిజ్వాన్ పాషా ఖాద్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్ షా అబ్దుల్ లతీఫ్ లావుబాలీ అలియాస్ హుస్సయినీ పీర్ సాహెబ్, నజీర్, అంజద్, మసీహ్ పాల్గొన్నారు.

అమ్మవారికి కానుకల సమర్పణ


భక్తులకు రసీదు ఇస్తున్న ఆలయ సిబ్బంది

గూడూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం కె నాగలాపురం గ్రామంలో వెలసిన సుంకులాపరమేశ్వరి అమ్మవారికి భక్తులు కానుకలను సమర్పించినట్లు ఆలయ సిబ్బంది కేశవ తెలిపారు. మంగళవారం ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆస్పరికి చెందిన తిమ్మప్ప చౌదరి కుటుంబ సభ్యులు రూ.61,150 నగదు కట్టిన రసీదును ఆలయ సిబ్బంది వారికి ఇచ్చారు. అలాగే జి.సింగవరానికి చెందిన మల్లికార్జున రెడ్డి 059 గ్రాముల లక్ష్మీ బిళ్ళల వెండి దండ కానుకగా సమర్పించినట్లు ఆలయ సిబ్బంది కేశవ తెలిపారు.

అన్న క్యాంటిన్ పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని సెట్కూరు కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటిన్‌ను మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు పరిశీలించారు. అల్పాహారం రుచిని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. టోకెన్ల జారీ, అన్నం వడ్డింపు, స్వచ్ఛత, తాగునీటి వసతులను సంబంధించి నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. అంతకుముందు బంగారుపేట, కొత్త బస్టాం డు, ఆనంద్ థియేటర్ కూడలి ప్రాంతాలలో పారిశుధ్య పను లను పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌ఈ రాజశేఖర్, ఎంఈ సత్య నారా యణ, డీఈఈలు గంగాధర్, శ్రీనివాసరెడ్డి, ఏఈ నాగజ్యోతి ఉన్నారు.

'ప్రైవేటు, పబ్లిక్ భాగస్వామ్య విధానాన్ని ఉపసంహరించుకోవాలి'

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలో ప్రైవేటు, పబ్లిక్ భాగస్వామ్య విధానాన్ని ఉపసంహరించుకోవాలని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజారోగ్య సంరక్షణలో వైద్య కళాశాలలు, ప్రైవేటు, పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానానికి మారిస్తే ఆరోగ్య హక్కుకు భంగం కలుగుతుందని ఆరోపించారు. గతంలో నిర్మాణం చేపట్టిన వైద్యకళాశాలలకు గానూ పది కళాశాలలో పీపీపీ విధానానికి మార్చడం దారుణమన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన వారికి మెడికల్ విద్యను దూరం చేసే కుట్రలో భాగమే ఈ విధానం తెలిపారు.

'యూత్ పార్లమెంట్'పై అవగాహన


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపకులపతి

కర్నూలు అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): యూత్ పార్లమెంట్ ద్వారా విద్యార్థులకు వ్యవస్థలు, రాజ్యాంగంపై అవగాహన కలుగుతుందని ఉపకులపతి వెంకట బసవరావు అన్నారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలోని ఆయన చాంబర్లో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూత్ పార్లమెంట్‌లో పాల్గొనడానికి 18 నుంచి 25 ఏళ్లలోపు వయస్సుగల యువతీ, యువకులు అర్హులన్నారు. ఈనెల 16 వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని, రిజిస్ట్రేష న్ సమయంలోనే అంశానికి సంబంధించి ఒక నిమిషం తప్పకుండా వీడియోను తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌లో రూపొందించిన అప్లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బోయ విజయ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ పి.నాగరాజు, వెంకటరత్నం, విజయుడు, నాగచంద్రుడు, శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

శంభాజీ మహారాజ్ చరిత్ర వెలుగులోకి రావాలి


శంభాజీ మహారాజ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): శంభాజీ మహారాజ్ చరిత్ర వెలుగులోకి రావాలని అఖిల భారత బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య అన్నారు. మంగళవారం బిర్లా కాంపౌండ్ శశికాంత్ ప్లాజాలో ఛత్రపతి శంభాజీ మహారాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంభాజీ మహారాజ్ దేశం కోసం పోరాడారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి ఆయన చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవపూజ ధనుంజయ్ అచారి, బాలక్రిష్ణ, సంస్కృత ఉపాధ్యాయుడు సర్వేశ్వరబాబు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మి పాఠశాలల పేరును ఉపయోగించుకుంటే చర్యలు



మాట్లాడుతున్న కరస్పాండెంట్ శేషన్న

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీలక్ష్మి పాఠశాలల పేరును ఉపయోగించుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరస్పాండెంట్ పి.శేషన్న అన్నారు. మంగళవారం ఎన్‌ఆర్ పేటలోని శ్రీలక్ష్మి పాఠశాలలో కరస్పాండెంట్ పి.శేషన్న, డైరెక్టర్ పి.దీక్షిత్‌లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీలక్ష్మి విద్యాసంస్థలను 1.6.2024న పూర్తిగా మాకు స్వాధీనం చేశారన్నారు. 2024-25 విద్యాసంవత్సరం నుంచి మా యజమాన్యం కింద పాఠశాలలు కొనసాగుతున్నాయని వివరించారు. శ్రీలక్ష్మి విద్యాసంస్థలను మాత్రమే ఈ పాఠశాలలు, సొసైటీలపైన సర్వహక్కులు ఉన్నాయన్నారు. అయితే శ్రీలక్ష్మి క్రేడో-దస్కూల్ యజ మాన్యం శ్రీలక్ష్మి పాఠశాలల పేర్లను అనైతికంగా వాడుకుంటుందన్నారు. శ్రీలక్ష్మి స్కూల్స్ పేరుతో అడ్మిషన్ల కోసం పోస్టులు పెడుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు తప్పుడు ప్రచారాలను నమ్మి మోసపోవద్దని వారు సూచించారు. ఈసమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ అరుణశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన బార్ అసోసియేషన్


హైకోర్టు న్యాయమూర్తికి వార్షికోత్సవ ఆహ్వాన పత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

కర్నూలు లీగల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూ ర్తులు జస్టిస్ కే.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ బీఎస్ భానుమతి, జస్టిస్ ఎస్.హరి నాథ్, జస్టిస్ ఎ.హరిహరనాథ శర్మలను కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మంగళవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 22న కర్నూలు బార్ అసోసియేషన్‌లో జరగబోయే వార్షికోత్సవానికి రావాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన వారిలో కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, హైకోర్టు బెంచ్ సాధన సమితి కన్వీనర్ కె.కపిలేశ్వరయ్య ఉన్నారు.

'యువత పోరు'కు తరలిరండి


పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

ఓర్వకల్లు మార్చి 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో విద్యార్థులు, యువత మోసపోతున్నారని, వారికి వైసీపీ అండగా నిలిచి పోరాటాలు చేస్తుందని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జీకే రంగన్న అన్నారు. మంగళవారం ఓర్వకల్లులో 'యువత పోరు'కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. బుధవారం నిర్వహించే యువత పోరుకు మండలంలోని యువత, నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, మాజీ సొసైటీ అధ్యక్షులు నాగతిరూపాలు, ఎంపీటీసీ పుల్లయ్య పాల్గొన్నారు.

రేపు 'మైఫర్'లో క్యాంపస్ డ్రైవ్

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఎ.క్యాంపులోని మైఫర్ ఫార్మసీ కళాశాలలో ఈనెల 13న ఉదయం 9 గంటలకు డీవీఎస్ ల్యాబ్ ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆదిమూలపు సతీష్ మంగళవారం తెలిపారు. వివిధ రకాల ఉద్యోగాల కోసం క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ డ్రైవ్‌కు బీఫార్మసీ, ఎంఫార్మసీ, బీటెక్ మెకానికల్, కెమికల్ డిపార్టుమెంటు, బీఎస్సీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ మైక్రో బయాలజీకి చెందిన అభ్యర్థులు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

హాలహర్వి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెహోసల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని(14)కి చేస్తున్న బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. మంగళవారం ఎస్సై చంద్ర, ఐసీడీఎస్ సూపర్వైజర్ చందన చంద్రావతి గ్రామానికి చేరుకుని బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. చిన్న వయసులో పెళ్లి చేయడం వల్ల వారి బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని అవగాహన కల్పించారు. వివాహం చేస్తే పెళ్లి పెద్దలు, తల్లిదండ్రులు, వరుడిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించడంతో వివాహాన్ని ఆపేసినట్లు అధికారులు తెలిపారు.

స్టేషన్‌కు చేరుకున్న ప్రశ్న పత్రాలు


ప్రశ్నపత్రాలను భద్రపరుస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి ప్రశ్న పత్రాలు మంగళవారం ఆదోని 2టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి, పరీక్షా కేంద్రాల ఇన్‌చార్జిల సమక్షంలో సెట్-1, సెట్-2లను వేరుచేసి ఇనుప బాక్సులలో భద్రపరిచారు. డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి, మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో 19 పరీక్షా కేంద్రాలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు వన్‌టౌన్, టూటౌన్, ఇస్వి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయని వాటిని భద్రంగా ఉంచినట్లు తెలిపారు. ఈ ఏడాది 3,000 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

అసంపూర్తిగా మార్కెట్ల వేలాలు


వేలాలు నిర్వహిస్తున్న కమిషనర్ కృష్ణ

ఆదోని టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం నిర్వహించిన మార్కెట్ల వేలాలు అసంపూర్తిగా ముగిశాయి. ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్‌కు సంబంధించి ఒక్క కాంట్రాక్టర్ మాత్రమే పాల్గొనడంతో కమిషనర్ కృష్ణ వేలాలను వాయిదా వేశారు. ఎద్దుల సంతను సర్కారు పాట రూ. 20.66 లక్షలు కాగా, హుసేనప్ప రూ. 22.60 లక్షలకు దక్కించుకొన్నారు. గొర్రెల సంత సర్కారు పాట రూ.7.27 లక్షలు కాగా అశ్వథ నారాయణ రూ.10.10 లక్షలకు దక్కించుకొన్నారు. ఝాన్సీ బాయి మార్కెట్ వేలాలను ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని కమిషనర్ తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

దేవనకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగట్టు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం నాయకులు వీరశేఖర్, యూసుఫ్ బాషా డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ పక్కనే గాజులదిన్నె ప్రాజెక్టు ఉన్నా, పది రోజులుగా తాగునీరు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే నీరందించి, సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ హరికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు.


మాట్లాడుతున్న నాయకులు

పరిమితికి మించి మందులు వాడొద్దు

మద్దికెర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పరిమితికి మించి క్రిమిసంహారక మందులు వాడవద్దని ఏవో రవి సూచించారు. మంగళవారం మద్దికెర, బి.ఎంపేట గ్రామాల్లో పొలంబడి నిర్వహించారు. రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని, వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. రైతులు తప్పకుండా విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈకేవైసీ చేయించుకున్న పంటలను మాత్రమే కొనుగోలు చేస్తారన్నారు. సిబ్బంది జాకీర్, ఆనంద్, రాణి ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి, హెచ్ఎం

వెల్దుర్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత అని పంచాయతీ సెక్రటరీ రహమత్ బాషా అన్నారు. మంగళవారం పుల్లగుమ్మి గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సుహాసిని ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడిచెత్త పచ్చ రంగు డబ్బాలో, పొడిచెత్త నీలం రంగు డబ్బాలో వేసి, సిబ్బందికి అందిచాలని కోరారు. అనంతరం విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు.

అంగన్‌వాడీల అభివృద్ధే కూటమి లక్ష్యం

మద్దికెర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల అభివృద్ధే కూటమి లక్ష్యమని అంగన్‌వాడీ, డ్వాక్రా సంఘాల పార్లమెంటు అధ్యక్షురాలు గూడూరు పద్మావతి అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కోసం నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.26.68 లక్షలు మంజూరు చేసిందన్నారు. గత వైసీపీ హయాంలో అంగన్‌వాడీలకు జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి అని, ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

పాత వారిని నిర్లక్ష్యం చేయడం సరికాదు

ఆదోని టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో పాతవారిని నిర్లక్ష్యం చేయడం సరికాదని మైనార్టీ పరిరక్షణ సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ అన్నారు. గణేకల్ గ్రామంలో ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన కొందరు 30 ఏళ్లుగా టీడీపీలోనే ఉన్న విరుపాక్షిపై దాడి చేయడం దారుణమన్నారు

మార్పు మంచిదే





మద్దికెర గ్రామంలోని మెయిన్ బజారులో రోడ్డుకిరువైపులా 20 ఏళ్లకు పైగా వ్యాపారాలు చేసుకునేవారు. రహదారి పక్కనే కూరగాయాలు ఉండటంతో నిత్యం వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడేవారు. కూటమి ప్రభుత్వం నాబార్డు నిధులు రూ.18 లక్షలు, మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి రూ.3లక్షలు విరాళం ఇచ్చారు. ఎమ్మెల్యే శ్యాంబాబు చొరవ తీసుకుని మార్కెట్ యార్డు నిర్మించారు. దీంతో వ్యాపారులు, మార్కెట్‌లో షెడ్ల కింద వ్యాపారాలు చేసుకుంటున్నారు. వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - మద్దికెర

ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల శ్రమ దోపిడీ

- అసెంబ్లీలో ఎమ్మెల్యే పార్థసారథి



ఆదోని, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఎమ్మెల్యే పార్థసారధి పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్‌లో మాట్లాడారు. 10 నెలలు పనిచేయించుకుని, కేవలం 9 నెలలకు మాత్రమే అరకొర జీతాలను ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ర్యాంకులు తెచ్చుకునేలా చదువు చెప్పాలని అధ్యాపకులను ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కూడా లేవన్నారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యా ప్రమాణాలు పాటించడం లేదని, తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వాపోయారు. వీటిపై విద్యాశాఖ మంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళా సాధికారతకు టీడీపీ పెద్దపీట

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు



ఆదోని, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు ఆవిర్భావం నుంచి టీడీపీ పెద్దపీట వేసిందని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు పేర్కొన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలకు ఆస్తి హక్కు కల్పించిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. చంద్రబాబు మహిళల ఆర్థిక స్వావలంభనకు డ్వాక్రా పథకానికి శ్రీకారం చుట్టి, వారి స్థితిగతులను మార్చారన్నారు. మహిళల పేరు మీద ఇళ్ల పట్టాలు, గృహాలు, భూమి కొను గోలు పథకాలు ఇచ్చారని, 2025-26 బడ్జెట్లో స్త్రీ, శిశు సంక్షేమానికి రూ.4,332కోట్లు కేటాయించా రన్నారు. వైసీపీ హయాంలో మహిళలకు బడ్జెట్లో తీవ్ర అన్యాయం చేశారని గుర్తు చేశారు. ఎస్సీ ఎస్టీ మహిళలకు ఒక్కో సభ్యురాలికి రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు వడ్డీ లేని రుణాలను ఇచ్చేందుకు శ్రీకారం చుట్టారన్నారు.

అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో శిక్షణ

ఆదోని అగ్రికల్చర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని న్యాక్ శిక్షణ కేంద్రంలో అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జి బీజీ ఉలుగన్న ఓ ప్రకటనలో తెలిపారు. యువతీ, యువకులకు 90 రోజుల పాటు ల్యాండ్ సర్వేపై ప్రాక్టికల్స్, థియరీ, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆర్ట్స్ కళాశాల రహదారిలోని ఎంసీయూపీ పాఠశాలలో ఉన్న న్యాక్ శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు కోఆర్డినేటర్ రాజశేఖర్ 9177413642, శిక్షణ నిపుణుడు రాజశేఖర్ 91885851817 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చంద్రబాబుతోనే బీసీలకు న్యాయం

ఆలూరు రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామనాథ్ యాదవ్ అన్నారు. మంగళవారం మాట్లాడుతూ వాల్మీకి, యాదవ సామాజిక వర్గం చెందిన బీటీ నాయుడు, బీద రవిచంద్రబాబు యాదవ్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అవకాశం కల్పించడం పట్ల చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు బీసీల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాము యాదవ్, టీయాన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి అంజి, అంబన్న పాల్గొన్నారు.


మాట్లాడుతూన్న రామనాథ్ యాదవ్

ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగునిస్తుందని బీమా ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ విష్ణువర్ధన్ రెడ్డి, సివిల్ డిపార్టమెంట్ అధ్యాపకురాలు నందిని రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థునులు ఆటపాటలతో గడిపారు. ఆడపిల్లలు ఆకర్షణలకు లోను కాకుండా తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అధ్యాపకులు భార్గవి, పద్మావతి, అనిత, రీతు, ప్రియాంక, ప్రిన్సిపాల్ సురేంద్రబాబు, డాక్టర్ ఆల్బర్ట్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ

తుగ్గలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు కృషితో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ మంజూరైందని టీడీపీ మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు తిరుపాల్‌నాయుడు, వెంకట్రాముడు చౌదరి అన్నారు. మంగళవారం తుగ్గలిలో మాట్లాడుతూ ఈ నెల 14న కనకదిన్నె వద్ద రూ.11 కోట్లతో నిర్మించబోయే టమోటా యూనిట్‌కు భూమి పూజ చేయనున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం రూ.14 కోట్లు మంజూరయ్యాయన్నారు.

నేడు కర్నూలులో అవగాహన సదస్సు

ఆదోని టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ ప్లాన్ల మంజూరుకు ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్‌పై ఈనెల 12న కర్నూలులోని మునిసిపల్ కార్యాలయంలో అవగాహన ఏర్పాటు చేసినట్లు టీపీవో బాల ముద్దయ్య మంగళవారం తెలిపారు. మునిసిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది, సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులతో పాటు, ఎల్‌టీపీలు కూడా తప్పక హాజరు కావాలని సూచించారు. కొత్త జీవో అమలుపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకొనే అవకాశం ఉంటుందని తెలిపారు.

'భవిత'కు నిధులు మంజూరు చేయాలి

పత్తికొండ టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల విద్యాభివృద్ధికి ఏర్పాటు చేసిన భవిత కేంద్రానికి నిధులు మంజూరు చేయాలని సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భవిత స్కూల్‌ను సీపీఎం బృందం సందర్శించింది. ఇక్కడ విద్యార్థులు తమ పనులను తామే చేసుకోలేరని, ప్రభుత్వం సహకరించాలని కోరారు. దస్తగిరి, గోపాల్ ఉన్నారు.

నేటితో ఇంటర్న్‌షిప్ దరఖాస్తుకు ఆఖరు

వెల్దుర్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పీఎం ఇంటర్న్‌షిప్‌కు నేడు ఆఖరు అని పదో తరగతి, ఆపై చదువుకున్న నిరుద్యోగులు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సహాయ కార్మికశాఖ అధికారి నీలిమ సంధ్య సూచించారు. 21 నుంచి 24 ఏళ్ల వయసు కలిగిన యువతీ, యువకులు అర్హులన్నారు. అభ్యర్థులకు ఏడాది పాటు నెలకు రూ.5వేలు చొప్పున, మొదటి నెల రూ.6వేలు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కార్పొరేటర్ వ్యవహారాల మంత్రిత్వశాఖ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, దీనికోసం ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.


దేవనకొండ: తెర్నేకల్‌లో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా రథోత్సవం

దేవనకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెర్నేకల్‌లో లక్ష్మి చెన్నమాధవ స్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం రథోత్సవంలో బోణాలు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు రథాన్ని ముందుకు లాగారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ్ కుమార్, జనసేన ఇన్‌చార్జి వెంకప్ప, వైసీపీ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు. జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థుల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజశేకర్ కబడ్డీ పోటీలను ప్రారంభించారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మద్దికెర: మండలంలోని పెరవలి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈవో వీరయ్య ఆధ్వర్యంలో చలువ పందిరి ఆకును ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

అంగరంగ వైభవంగా ఎడవలి జాతర

మద్దికెర మండలంలోని ఎడవలి గ్రామంలో జగనన్న కాలనీలో అంగరంగ వైభవంగా సుంకులమ్మ దేవర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మంగళవారం మూలవిరాట్ సుంకులమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో భక్తులు చలువకుండలు తీసుకుని మేళతాళాలతో దేవాలయం చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి జంతుబలులు చేశారు.

స్థలం ఉన్నవారికి పక్కా గృహాలు

మద్దికెర, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో సొంత స్థలాలు ఉండి ఇల్లు లేని పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయిస్తామని హౌసింగ్ డీఈ విజయకుమార్, ఏఈ ఉమాకాంత్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పక్కా గృహాలు మంజూరు చేసేందుకు సర్వే చేస్తున్నామన్నారు. ఒక్కో గృహానికి రూ.1.80 లక్షలు ఇస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే గృహాలకు రూ.2.50 లక్షలు ఇస్తుందన్నారు.

పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లను పునరుద్ధరించాలి


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్లను పునరుద్ధరించాలని ఆర్‌పీవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి ఖాజా కోరారు. మంగళవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం నాడు-నేడు కింద రూ.లక్షలు ఖర్చుచేసి ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసిందన్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ప్లాంట్లు పని చేయడం లేదన్నారు. పాఠశాలలకు త్రీ ఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించి, ఆర్వో ప్లాంట్లను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

ఏప్రిల్ 15 వరకు హంద్రీ నీవాకు నీరు ఇవ్వాలి

పత్తికొండ టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు ఏప్రిల్ 15 వరకు నీరు ఇవ్వాలని సీపీఐ కార్యదర్శి రాజాసాహేబ్, సురేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయ సూపరిండెంట్ సుదర్శన్‌కు వినతి పత్రం అందజేశారు. కాలువ వెంబడి వేలాది ఎకరాల్లో పంటలు సాగు చేశారని, మార్చి 15 నుంచి నీరు నిలిపేస్తామని అధికారులు ప్రకటించడం రైతులను తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. తిమ్మయ్య, గురుదాసు, సుల్తాన్, పెద్దయ్య, నాగిరెడ్డి, హనుమంతు పాల్గొన్నారు.


వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

హొళగుంద, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22వతేదిన కోడుమూరులో తలపెట్టిన రజక సంఘం మహాసభలను విజయ వంతం చేయాలని నాయకులు నాగరాజు, కురుకుంద నాగరాజు, చాకలి మంగయ్య, చాకలి మల్లికార్జున మంగళవారం కోరారు. జిల్లా మహాసభల కర పత్రాలను విడుదల చేశారు. మల్లికార్జున, సున్నం వీరేష్, హనుమేష్ పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

పనిభారం తగదు


వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

దేవనకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యదర్శులపై అదనపు పనిభారం తగదని పంచా యతీ కార్యదర్శులు రాముడు, శివశంకర్‌సింగ్, రఫీ, శ్రీనివాసులు అన్నారు. ఈమేరకు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రమణమ్మకు వినతి పత్రం అందజేశారు. వివిధ సర్వేలు, ప్రభుత్వ కార్యక్రమాలను తమకు అప్పగించడంతో సెలవు, పండుగ దినాల్లో పనిచేయాల్సి వస్తోందని, మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రఫీ, యుగంధర్, సునీత, తులసి పాల్గొన్నారు.

కోలుకోలేక మృతి

దేవనకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తొందరపాటుతో ఆత్మహత్యకు యత్నించిన వాహిద్ అనే యువకుడు కోలుకోలేక మంగళవారం మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు ... నందవరం మండల కేంద్రానికి చెందిన ఖాజాహుసేన్, రజియా బీ దంపతులకు కుమారుడు వాహిద్ (24)కు తొమ్మిది నెలల కిందట తారాపురం గ్రామానికి చెందిన చాంద్‌బీ తో వివాహమైంది. అయితే పది రోజుల క్రితం భార్య చాంద్ బీ నందవరంలో ఉరేసుకొని మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు వాహిద్ ఇంటిపై దాడి చేయడంతో వాహిద్ దేవనకొండలోని బంధువుల ఇళ్లలో తలదాచుకున్నాడు. అయితే శనివారం ఊరికి వెళ్తూ మార్గమధ్యలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులకు కర్నూలుకు తరలించారు. వాహిద్ మంగళవారం కర్నూలు వైద్యశాలలో మృతి చెందాడు. దేవనకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హొళగుంద పీహెచ్‌సీ ఆఫీసర్‌గా బి. చంద్రశేఖర్

కర్నూలు హాస్పిటల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హొళగుంద పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా బి. చంద్రశేఖర్ పదోన్నతి పొందారు. మూడేళ్లుగా నంద్యాల జిల్లా ఎర్రమఠం పీహెచ్‌సీలో ఎంపీహెచ్ ఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆయనకు హొళగుందలో పోస్టింగ్ ఇచ్చారు.

గృహ నిర్మాణాలకు అదనంగా రూ.50వేలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పత్తికొండ హౌసింగ్ డీఈ విజయకుమార్



పత్తికొండ టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ గృహ నిర్మాణం పథకం లబ్దిదారులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.1.80 లక్షలతో పాటు అదనంగా రూ.50వేలు లబ్దిదారులకు ఇస్తున్నట్లు పత్తికొండ హౌసింగ్ డీఈ విజయకుమార్ తెలిపారు.

ప్రశ్న: ఏ పథకం కింద నిధులు అదనంగా వచ్చాయి?

జవాబు: 2019 నుంచి 2025 లో అర్బన్ కింద గృహాన్ని నిర్మించుకున్న లబ్ధిదారులు బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు ప్రభుత్వం ఇస్తుంది.

ప్రశ్న: డివిజన్‌లో ఎన్ని గృహాలు ఉన్నాయి?

జవాబు: ఎన్టీఆర్ బీఎల్‌సీ కింద 5,800 గృహాలుఉన్నాయి. 2,913 పూర్తి కాగా, మిగతావి 2వేలకు పైగా గృహాల్లో నిర్మాణంలో ఉన్నాయి.

ప్రశ్న: అదనంగా రూ.50వేలు అందాలంటే ఎప్పటిలోగా పూర్తి చేయాలి?

జవాబు: రూ.50వేల అదనపు నిధులు మంజూరు కావాలంటే జూన్ 2వ తేదీలోపు నిర్మాణాలు పూర్తి చేయాలి.

ప్రశ్న: ప్రధానమంత్రి యోజన పథకం నూతన గృహాలకు దరఖాస్తులు వచ్చాయా?

జవాబు: నియోజకవర్గంలో ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం 2.0 కింద 7,111 దరఖాస్తులు వచ్చాయి.

ప్రశ్న: మండలాల వారీగా దరఖాస్తుల వివరాలు?

జవాబు: పత్తికొండ మండలంలో 620, మద్దికెర 671, తుగ్గలి 2255, క్రిష్ణగిరి 1836, వెల్దుర్తి 1129, మొత్తం 7,111 దరఖాస్తులు వచ్చాయి.

ప్రశ్న: కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తారా?

జవాబు: మార్చి 15లోపు ప్రధాన మంత్రి యోజన పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులు కుల, ఆదాయం, ధృవీకరణ పత్రాలు ఇచ్చిన వారి పేర్లను డీపీఆర్ చేసి ఉన్నతాదికారులకు పంపుతాం.

ప్రశ్న: ఈ పథకం కింద ఇంటి నిర్మాణాలకు ఎంత నిధులు ఇస్తున్నారు?

జవాబు: ఒక్కో లబ్దిదారుని రూ.2.50 లక్షల నిధులు ప్రభుత్వం ఇస్తుంది.

వాతావరణ మార్పులపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న నాబార్డు ఏజీఎం సుబ్బారెడ్డి

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జాతీయ వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి బ్యాంకు(నాబార్డ్), కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు వాతావరణ మార్పులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాబార్డ్ ఏజీఎం సుబ్బారెడ్డి, ఏరువాక కేంద్రం కర్నూలు కో-ఆర్డినేటర్ సుజాతమ్మ, ప్రాంతీయ పరిశోధన సంస్థ, నంద్యాల శాస్త్రవేత్త అరుణ్‌కుమార్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు సంఘటితం కావాలన్నారు. విలువ, ఆధారిత ఉత్పత్తులతో అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. పంటల మార్పిడితో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. అధిక వర్షపాతం, బెట్ట పరిస్థితుల్లో పంటలను ఎలా కాపాడుకోవాలో రైతులకు వివరించారు. సమావేశంలో కేవీకే శాస్త్రవేత్తలు శ్రీచందన, నిరంజన్‌రెడ్డి, మౌనిక, నవయూత్ అసోసియేషన్ సీఈవో నరసింహులు, ఎఫ్‌పీవో సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మహిళలను దగా చేసిన జగన్

మంత్రాలయం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మహిళలను దగా చేసి, తల్లి, చెల్లిని గెంటేసిన మాజీ సీఎం జగన్ రెడ్డికి అక్కా చెల్లెమ్మ అనే అర్హత లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. మంగళవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కు ఇచ్చిన ఘనత వారికే దక్కుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా రాణించాలనే ఉద్దేశంతో డ్వాక్రా పథకానికి శ్రీకారం చుట్టి వారి జీవన నైపుణ్యాలను మార్చారన్నారు. ఉచితంగా ఇల్లు ఇస్తామని చెప్పి జగన్ మహిళల నుంచి రూ.10వేలు లాక్కున్నారని ఆరోపించారు. సమావేశంలో టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయాన్ని పెంచాలి

నందవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తడి, పొడిచెత్తతో వర్మీకంపోస్టును తయారు చేయాలని, దాంతో పంచాయతీలకు ఆదాయం పెంచాలని పంచాయతీ కార్యదర్శి నౌసన్న అన్నారు. మంగళవారం మండలంలోని నాగలదిన్నె గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పలు వీధులలో గ్రామ వార్డు సభ్యులు పర్యటించారు. ప్రతి ఇంటికి తడి, పొడి చెత్తలను వేసుకు నేందుకు గాను రెండు ప్లాస్టిక్ డబ్బాలను అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ గామంలో ప్రజలు తమ ఇళ్లలోని తడి, పొడి చెత్తలను చెత్త బండ్లలోనే వేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూనాఫ్, మహబూబ్, సూరి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుకు ఆర్థిక సాయం

పెద్దకడుబూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్డిమేకల గ్రామంలో గడ్డివామి దగ్ధమై నష్టపోయిన రైతు మల్లేష్‌కు గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ ఆర్థిక సాయం అందజేశారు. పది ఎకరాల గడ్డివామి దగ్ధం కావడంతో రైతుకు నష్టపోయాడని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో శివరామిరెడ్డి, నరసన్న, వీరేష్, ఈరన్న, విష్ణు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గోనెగండ్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంజహళ్లి గ్రామం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మునిస్వామి అనే వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు సీఐ గంగాధర్ తెలిపారు. గోనెగండ్లకు చెందిన మునిస్వామి పెయింట్ పని చేస్తూ జీవనం సాగించే వాడు. అయితే బైలుప్పల గ్రామంలో పెయింట్ పని ముగించుకొని సాయంత్రం గోనెగండ్లకు తన ద్విచక్రవాహనంలో వస్తుండగా వెనుక వైపు నుంచి బైలుప్పల గ్రామానికి చెందిన వేణుగోపాలరెడ్డి అనే వ్యక్తి అతి వేగంగా ద్విచక్రవాహనలో వచ్చి ఢీ కొట్టడంతో మునిస్వామికి ఎగిరి రోడ్డుపై పడ్డాడు. దీంతో చేతులకు, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. కుడికాలు విరిగింది. ప్రమాదస్థలంలో ఉన్న కొందరు వ్యక్తులు మునిస్వామి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి విషయం తెలిపారు. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరతలించగా మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

కళాశాల అనుమతులు రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఆర్‌పీఎస్‌ఎఫ్ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీఎంఆర్ బీఈడీ కళాశాల రాయలసీయ యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహిస్తుందని, కళాశాల అనుమతులు రద్దు చేయాలని ఆర్‌పీఎస్‌ఎఫ్ డిమాండ్ చేసింది. మంగళవారం రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ అఫ్రిది మాట్లాడుతూ రాయలసీమ వర్సిటీ పరిధిలో ఉన్న జీఎంఆర్ బీఈడీ కళాశాలలో సరైన వసతులు లేకున్నా తరగతులు నిర్వహించకుండానే పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి మధ్యవర్తుల ద్వారా అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేసి దోచుకుం టున్నారన్నారు. వీసీ స్పందించి జీఎంఆర్ కళాశాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఎండుతున్న హంద్రీ

- పరివాహక గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు
- అక్రమంగా తరలుతున్న ఇసుక
- అడుగంటుతున్న భూగర్భ జలాలు



వేముగోడు దగ్గర ఎండుతున్న హంద్రీ నది

గోనెగండ్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచే ఎండలు మండుతున్నాయి. ఇప్పటికే 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఇక మార్చి చివరికి మరింత ఎండలు ఉంటాయని నిపుణులు తెలుపుతున్నారు. అయితే ఎండ వేడిమి పెరగడంతో హంద్రీ నదిలోని నీరు ఆవిరై పోతుంది. దీంతో భూగర్భజలాలు అడుగంటి పోవడంతో హంద్రీ పరివాహక గ్రామాలలోని సమీపంలో వేసిన బోర్లు బావులలో నీరు కూడా అడుగంటి పోతుంది. దీనికితోడు వేముగోడు గ్రామ సమీపంలోని హంద్రీ నదిలోని ఇసుకను కొందరు అక్రమంగా రోజుకు 20 నుంచి 30 ట్రాక్టర్‌లతో తరలిస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ఇదీ కాక ఇసుకను తరలిస్తుండటంతో ప్రస్తుతం బోర్లకు వస్తున్న నీరు కూడా ఉప్పగా మరిపోతుందన్ని వేముగోడు గ్రామస్థులు తెలుపుతున్నారు. హంద్రీ గ్రామాలలో ఇప్పటికే తాగునీటి సమస్య ప్రారంభమయింది. హంద్రీ పరివాహక గ్రామాలైన హెచ్ కైరవాడి, పుట్టపాశం, వేముగోడు, తిప్పనూరు, లింగందిన్నె, ఎర్రబాడు, బోదేపాడు, వీరంపల్లి తదితర గ్రామాలలో బోర్లులకు నీరు పట్టిపట్టి వస్తున్నాయని, ఇక మరో పది లేక పదిహేను రోజులలో బోర్లకు అందకపోవచ్చునని గ్రామస్థులు తెలుపుతున్నారు. ఇక హంద్రీ పరివాహక గ్రామాల్లో తాగేందుకు నీరు ఇబ్బందిగా మరుతుందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అగ్రహారం గ్రామంలో మరో పదిరోజుల్లో తాగునీటి సమస్య వస్తుందని గ్రహించిన పంచాయతీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి: ఏఐటీయూసీ



మాట్లాడుతున్న మునెప్ప

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీఐటీయూ నియోజకవర్గ అధ్యక్షుడు వీరేష్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని, ఉక్కు పరిశ్రమకు సొంత గనులు ఏర్పాటు చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల రాష్ట్ర సమితీ పిలుపు మేరకు ఈనెల 14న అన్ని కలెక్టరేట్లు, నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయమని స్పష్టమైన ప్రకటన ఇవ్వడంలేదన్నారు. కేంద్ర మంత్రి కుమారస్వామి విశాఖ ఉక్కు పరిశ్రమను సెయిల్‌కు అప్పగించి ఆదుకుంటామని చెబుతునే డబ్బు ఆశ చూపి 4500 మంది కార్మికులను వలంటరీ రిటైర్డ్‌మెంట్‌కు సన్నద్ధం చేస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు లాభాల బాటలో నడిచేలా ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలన్నారు. ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు ఈనెల 14న జిల్లా వ్యాప్తంగా చేపట్టే ఆందోళన కార్యక్రమాల్లో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి తిమ్మగురుడు, పట్టణ కార్యదర్శులు నరసింహారెడ్డి, విజయేంద్ర, సుంకన్న, రాజు, మధు, నరసింహులు, నారాయణ పాల్గొన్నారు.

అద్దె బకాయిలు చెల్లించలేదని..
మున్సిపల్ దుకాణాలకు తాళాలు



బకాయి పడ్డ మున్సిపల్ దుకాణానికి తాళం వేస్తున్న అధికారులు

ఎమ్మిగనూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అద్దెలు చెల్లించకుండా బకాయిలు పేరుకుపోయిన మున్సిపల్ దుకాణాలకు అధికారులు తాళాలు వేశారు. అధికారులు తెలిపిన సమాచారం మేరకు పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్ అద్దెలకు ఉంటున్న కొంతమంది వ్యాపారులు అద్దెలు చెల్లించక పోవటంతో దాదాపు రూ. 20లక్షల వరకు బకాయిలు పేరుకుపోయాయి. దీంతో మున్సిపల్ అధికారులు దుకాణాలకు తాళాలు వేస్తున్నారు. స్థానిక సోమప్ప సర్కిల్‌లో ఉన్న బీ1, బీ4, బీ5, సీ17 దుకాణాల అద్దెలు చెల్లించాలని సోమవారం మున్సిపల్ అధికారులు దుకాణదారులను కోరినప్పటికి చెల్లించకపోవటంతో చేసేది లేక తాళాలు వేశారు. ఇందులో బీ1 దుకాణం బకాయి దాదాపు రూ. 1.42లక్షలు, బీ4, బీ5 దుకాణాల బకాయి రూ. 1.30లక్షలు, సీ 17 దుకాణ బకాయి రూ. 1.20లక్షలు ఉండటంతో వాటికి తాళాలు వేసి అద్దెలు చెల్లించాలని సూచించారు. ఇందులో సీ 17 దుకాణ నిర్వాహకుడు రూ. 72 వేలు చెల్లించి మిగతా మొత్తం త్వరలో చెల్లిస్తామని చెప్పటం తెరుచుకునేందుకు అవకాశం ఇచ్చారు. మిగతా దుకాణాలకు మాత్రం తాళాలు వేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ అస్లాం బాషా మాట్లాడుతూ దుకాణదారులు సకాలంలో అద్దెలు చెల్లించాలని సూచించారు. అలాగే బకాయిలు ఉన్న దుకాణాల వారు వెంటనే బకాయిలు చెల్లించి మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు.

బాలికను చైల్డ్ హోమ్‌కు తరలింపు

గోనెగండ్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికను మంగళవారం ఐసీడీఎస్ అధికారులు కర్నూలులోని చైల్డ్ హోమ్‌కు తరలించారు. అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన బాలికకు ఈనెల 9న తల్లిదండ్రులు వివాహం జరిపినట్లు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందడంతో మంగళవారం బాలిక ఇంటి దగ్గరకు వచ్చి విచారణ చేశారు. అయితే బాలిక తల్లిదండ్రులు మాత్రం వివాహం చేయలేదని అధికారులకు తెలిపారు. అయినప్పటికి విచారణ జరిపిన అధికారులు బాలికను కర్నూలులోని చైల్డ్ హోమ్‌కు తరలించారు. అలాగే అదే గ్రామంలోనే మంగళవారం మరో బాలిక వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నట్లు తెలిసింది.

గ్రామాల్లో ప్రశాంత జీవనం గడపాలి: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

నందవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ప్రశాంత జీవనం గడపాలని డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. మంగళవారం నందవరం బీసీ కాలనీలో ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పంట పొలాల దగ్గర, గట్లు విషయంలో సర్దుకుపోవాలని, లేదా అధికారులకు ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కరిస్తామన్నారు. కొంతమంది దొంగ బంగారం లాంటివాటితో ప్రజలను మధ్య పెడతారని అలాంటి వాటి జోలికి వెళ్లొద్దన్నారు. అలాగే ఆన్‌లైన్ జాబ్స్ పేరుతో యువతను పెడదోవ పట్టిస్తారని జాగ్రత్తగా ఉండాలన్నారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు వాహనదారులు అతివేగంగా వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. హెల్మెట్ ధరించాలన్నారు. సైబర్ నేరగాళ్ల గురించి అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలపై దాడులు మంచిది కాదన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలపై అవగాహన ఉండాలన్నారు. చిన్న వయస్సు పిల్లలకు పెళ్లి చేస్తే జరిగే పరిణామాల గురించి వివరించారు. చిన్న విషయాలకు కూడా ఘర్షణలకు పాల్పడవద్దన్నారు. సమావేశంలో పోలీసులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

నందవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఏపీఎం రాఘవేంద్ర ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యాలయంలో జండర్ రిసోర్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీంతో చిన్న వయస్సులో పెళ్లిళ్ల, మహిళల బాధలు అన్ని ఇక్కడకు వచ్చి అవగాహన కల్పించి పరిష్కరించుకోవచ్చన్నారు. శ్రీనిధి టార్గెట్ ఎంత వచ్చింది, ఎంత వరకు పూర్తి చేశారని అడిగి తెలుసుకున్నారు. ఏపీఎం మాట్లాడుతూ రూ . ఆరు కోట్లు వచ్చిందని అంత పూర్తి చేశామన్నారు. పొదుపు గ్రూపులకు అవగాహన కార్యకమాలు ఏర్పాటు చేసి బ్యాంక్ లింకేజీ, తీసుకున్న రుణాలను సక్రమంగా కట్టేలా చూడాలన్నారు. అనంతరం పాత బడ్డ శ్రీశక్తి భవనాన్ని పరిశీలించారు. పనులు ముగిసినప్పటికి అరకొర పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఏపీఎం తెలిపారు. ఈ విషయంపై పీడీ రమణారెడ్డి, పీఆర్‌డీఈ, చంద్రశేఖర్, పీఆర్ ఏఈ నరసింహులుతో మాట్లాడారు. తమ దగ్గర నిధులు లేవనడంతో ఎంపీపీ, జనరల్ ఫండ్‌లో చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రాఘవేంద్ర, ఏవో కృష్ణమూర్తి, సీసీ ముక్కరన్న పాల్గొన్నారు.

నేడు కనవీడులో మఠం మల్లయ్య స్వామి పుణ్యారాధన

ఎమ్మిగనూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నందవరం మండలంలోని కనకవీడు గ్రామంలో వెలసిన బ్రహ్మశ్రీ మఠం మల్లయ్య స్వామి పుణ్యారాధన ఉత్సవం నిర్వహిస్తున్నట్లు మఠం సేవాసమితి నిర్వాహకులు వీరభద్రస్వామి తెలిపారు. గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో నిర్వహించే పుణ్యారాధణ ఉత్సవం సందర్భంగా బుదవారం మఠంలో స్వామి వారికి రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామి వారి చిత్రపటంతో గ్రామ వీధులలో నంది కోలు సేవతో ఊరేగించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే రాత్రి భజన కార్యక్రమం చేసి గురువారం తెల్లవారుజామున స్వామివారికి మంగళహారి ఇవ్వనున్నారు. పుణ్యారాధనలో గ్రామ పెద్దలు లక్ష్మీకాంతరెడ్డి, రఘుమూర్తి స్వామి, ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, ఆయన సోదరుడు శ్రీనివాస రెడ్డిలు పాల్గొననున్నారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థులకు బహుమతి ప్రదానం

ఎమ్మిగనూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షలపై భయం వీడాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి సహాయ కార్యదర్శి నల్లారెడ్డి యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని గుడ్‌షప్పర్డ్ పాఠశాలలో ఫిబ్రవరిలో విద్యార్థులకు నిర్వహించిన మైండ్ ప్రీప్ పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం ప్రిన్సిపాల్ జాన్‌మోజేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ పోటీలను 3వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించారు. ఇందులో 16 మంది విద్యార్థులు మంచి ప్రతిభను చాటడంతో బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నల్లారెడ్డి యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్నాయని విద్యార్థులు ఏమాత్రం భయపడకుండా పరీక్షలను రాయాలన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రంలో ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా ఆలోచించి పరీక్షలను రాస్తే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారు రథంపై ప్రహ్లాదరాయలు



బంగారు రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు బంగారు రథంపై విహారించారు. మంగళవారం ద్వాదశి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజామునుంచే బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. బృందావనానికి క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. పూర్ణబోధ పూజ మందిరంలో మూలరాములకు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి పూజలు చేశారు. మఠం పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

ధార్మిక పర్యటనకు వెళ్లిన పీఠాధిపతి: రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ధార్మిక పర్యటనలో భాగంగా మంగళవారం కర్ణాటకలోని హావేరి జిల్లా హొసరిత్తికి బయలుదేరి వెళ్లారు. బుధవారం జరిగే శ్రీమఠం పూర్వ పీఠాధిపతి ధీరేంద్ర తీర్థుల మధ్యారాధన మహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పర్యటన ముగించుకొని శనివారం ఉదయం మంత్రాలయానికి చేరుకుంటారని ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేష్ జోషి తెలిపారు.

పంపన్న గౌడ్ కాలనీలో చోరీ

ఎమ్మిగనూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంపన్న గౌడ్ కాలనీలో దొంగలు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. స్థానికులు, ఇంటి యజమాని తెలిపిన సమాచారం మేరకు.. పంపన్న గౌడ్ కాలనీలో రామలింగేశ్వర మెడికల్ ఏజన్సీ పైన రెండు షెడ్లు వేసి అద్దెకు ఇచ్చారు. అద్దె ఉంటున్న కుటుంబం కోసిగిలో జరిగే దేవర ఉత్సవానికి వెళ్లింది. ఇంటికి తాళం వేసి వుండటంతో సోమవారం వేకువజామున గుర్తుతెలియని దొంగలు మెడికల్ ఏజన్సీపై భాగంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వైర్లను కత్తిరించి ఇంటి తాళాలను పగుల గొట్టారు. ఇంట్లో విలువైన వస్తువులు, డబ్బుకోసం వెతికారు. ఈక్రమంలో వస్తువులన్నింటిని చిందరబందరగా పడేశారు. చివరకు హుండీలో ఉన్న దాదాపు రూ. పదివేలను ఎత్తుకెళ్లారు. ఉదయం విషయం తెలుసుకున్న గృహయజమానులు పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గడ్డి వాములు దగ్ధం

కౌతాళం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాపురం గ్రామంలో మంగళవారం మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దళిత కోలికి ఈరప్ప, దళిత కాలే మారెప్ప, దళిత బజారికి చెందిన గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. మూడు గడివాములు పక్కనే పక్కనే ఉండటంతో నిమిషాల వ్యవధిలో మంటలు చెలరేగాయి. గ్రామస్థులు ఆదోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా అగ్నిమాపక యంత్రం వచ్చే సరికి మూడు గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.3లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసి కేసు నమోదు చేసుకున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

పెద్దకడుబూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబదహాల్ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని అభ్యుదయ విద్యార్థి సంఘం నాయకులు ఖాజా, కృష్ణ కోరారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యాభద్వాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అధిక శాతం ఉప్పునీరు ఉందని, దీంతో ప్రజలుతీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి



పోలీస్ స్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న జైభీం ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దకడుబూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులకు పోలీసులు న్యాయం చేయాలని జైభీం ఎమ్మార్పీఎస్ నాయకులు సిక్కిం జానయ్య కోరారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ముందు బాధితురాలితో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిక్కిం జానయ్య మాట్లాడుతూ దళితులకు అన్యాయం జరిగితే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో రాము, బుజ్జప్ప, ఆనందు, సీమోన్, ప్రభాకర్, అశోక్, అంజినయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించాలి

మంత్రాలయం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సర్వేల పేరుతో పని ఒత్తిడి అధికం చేసి మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తోందని, పని ఒత్తిడి నుంచి తగ్గించాలని గ్రామ కార్యదర్శులు వేణుగోపాల్, నాగరాజు, మహేష్, లక్ష్మీదేవి కోరారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాధ, ఈవోఆర్‌డీ ప్రభావతిదేవీలకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో గ్రామ కార్యదర్శి మిస్సింగ్ సిటిజన్స్ సర్వే, ఎంప్లాయిస్ సర్వే, వర్క్ ఫర్ హోం సర్వే, హౌస్ లోన్ జియో ట్యాగింగ్, డెత్ రీవెరిఫికేషన్ సర్వే ఎన్నో రకాల సర్వేలతో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇవే కాకుండా ఇంటి పన్ను, కొళాయి పన్ను, లైసెన్సులు, లీజు, వేలం, ఇతర పన్నుల వసూళ్లు, తాగునీటి ట్యాంకుల శుభ్రం, క్లోరినేషన్, మూడోసారి శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు వంటివి నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ కార్యదర్శులు పని ఒత్తిడిలో తీరిక లేక పండుగలు, శుభకార్యాలకు హాజరు కాలేక మానసికంగా కుంగిపోతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు లక్ష్మీదేవి, వీరేష్ స్వామినాథన్, దశ రథ్, రాముడు, రామకృష్ణ, రాజేష్ పాల్గొన్నారు.

పరీక్షలంటే విద్యార్థులు భయం వీడాలి

కోసిగి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు పరీక్షల్లో భయం వీడి ధైర్యంగా పరీక్షలు రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వీరేష్ అన్నారు. కోసిగిలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సమీరారెడ్డి ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ హాస్టల్ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులను ఏఐఎస్ఎఫ్ నాయకులు విద్యార్థులకు అందజేశారు. ఈ నెల 17 నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలో విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా ఇష్టంతో పరీక్షలు రాయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయ కులు రాము, అశోక్ కుమార్, శేఖర్, చంద్రనాయక్ పాల్గొన్నారు.

కుల దురహంకార హత్యలకు తగిన శిక్షే

మంత్రాలయం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కుల దురహంకార హత్యలకు తగిన శిక్ష పడిందని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి దేవపుత్ర, డివిజన్ నాయకులు సుమాలా చార్లెస్, ప్రసన్న కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణయ్ హత్య కేసులో ఎస్సీ, ఎస్టీ కోర్టు ఇచ్చిన తీర్పు కుల దుహంకారులకు వణుకు పుట్టిస్తుదన్నారు. అదే విధంగా కౌతాళం మండలం కామవరం, రచ్చుమర్రి, పెద్దకడుబూరు మండలం కల్లుకుం టలో ఇలాంటి సంఘటనలే జరిగాయన్నారు. ఇలాంటి ఘటనలపై నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నిత్యం పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు రవి, రాజేష్ పాల్గొన్నారు.

బోర్డులు ఏర్పాటు చేయాలి

మంత్రాలయం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పట్టణ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములకు రీసర్వే చేసి లిఖిత పూర్వకంగా బోర్డులు ఏర్పాటు చేసి సంరక్షించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బీవీ భాస్కర్ యాదవ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ ఎస్.రవిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో శ్రీమఠం కట్టడాలు ఉంటే ప్రభుత్వ కట్టడాలుగా గుర్తించి ఆ భూమిని ప్రభుత్వ భూమిగా లిఖిత పూర్వక భూములుగా గుర్తించాలని కోరారు. శ్రీమఠం నుంచి రైతులు తీసుకున్న భూములకు రీసర్వే చేయించి సాగు చేస్తున్న వారికి భూములను ఇచ్చే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్య దర్శి లక్ష్మన్న, గాబ్రియేలు, రఘు, తదితరులు పాల్గొన్నారు.